
సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రతీక్ జైన్

విద్యార్థుల సంక్షేమంపై దృష్టి పెట్టాలి

వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్ జైన్

వికారాబాద్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని ఐదు బెస్ట్ అవైలబుల్ పాఠశాలలో చదువుతున్న విద్యార్థుల సంక్షేమంపై సంబంధిత అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ ప్రతీక్ జైన్ సూచించారు. మంగళవారం డిప్యూటీ స్పీకర్ భట్టి విక్రమార్క హైదరాబాద్ నుంచి మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌తో కలిసి ఆయన కలెక్టర్లు, అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో సిద్దార్థ ఎక్సలెన్స్ కేవీఎం హై స్కూల్, కుల్కచర్ల, డిఫోడిల్స్ హై స్కూల్, పరిగి, సెయింట్ మార్క్ హైస్కూల్, తాండూరు, కర్ణం వెంకట్రావు మెమోరియల్ హైస్కూల్, కుల్కచర్ల ఉన్నాయన్నారు. విద్యా బోధన, విద్యార్థుల ఆరోగ్య స్థితి, మౌలిక వసతులు, భోజన నాణ్యత వంటి అంశాలను నిరంతరం పర్యవేక్షించాలన్నారు. కార్యక్రమంలో డీటీడీవో కమలాకర్ రెడ్డి, బీసీ వెల్ఫేర్ అధికారి మాధవరెడ్డి, జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి రాజేశ్వరి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

స్వచ్ఛభారత్‌లో భాగస్వాములు కావాలి

చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి



స్వచ్ఛభారత్ వాహనాన్ని ప్రారంభిస్తున్న ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

పరిగి, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): స్వచ్ఛభారత్‌లో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి కోరారు. ప్రధాని నరేంద్రమోదీ పిలుపు మేరకు స్వచ్ఛ భారత్‌శ్రేష్ఠ భారత్‌లో భాగంగా స్వచ్ఛ భారత్ వాహనాన్ని ప్రారంభించారు. అనంతరం ప్రభుత్వ పాఠశాల పరిసరాల్లో పర్యటించి సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పరిగిలోని పాఠశాలల్లో వాష్‌రూమ్‌ల నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని చెప్పారు. తమ ట్రస్టు ద్వారా మండలానికో స్వచ్ఛభారత్ వావాహనాన్ని కేటాయిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కేఎస్‌ఆర్ ట్రస్టు చైర్మన్ శరత్ కుమార్‌రెడ్డి, పరమేశ్వర్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి పెంటయ్య, రాచంద్రయ్య, పట్టణ అధ్యక్షుడు బాలకిష్టారెడ్డి, టీవీ నర్సింహులు, వార్ల అంజనేయులు పాల్గొన్నారు.

చెరువుల్లోకి చేప పిల్లలను వదిలేందుకు ముహూర్తం ఖరారైంది. ఇందుకు జిల్లా మత్స్యశాఖ అధికారులు సన్నాహాలు చేపట్టారు. వారం రోజుల్లో చేప పిల్లల పంపిణీ చేపడతామని మంత్రి వాకిటి శ్రీహరి ప్రకటించిన నేపథ్యంలో మత్స్యకారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో మొత్తం 778 చెరువులు, కుంటలు ఉన్నాయి. అలాగే 151 మత్స్య సహకార సంఘాల్లో 5,600 మంది సభ్యులు ఉన్నారు. కాగా, 1,29,72,000 చేప పిల్లలను చెరువుల్లో వదలాలని జిల్లా మత్స్యశాఖ అధికారులు లక్ష్యం నిర్దేశించుకున్నారు.



చేప పిల్లల పంపిణీకి కుదిరిన ముహూర్తం

సరఫరాకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్

జిల్లా లక్ష్యం 1.29 కోట్ల చేప పిల్లలు

- ఏర్పాట్లు చేస్తున్న మత్స్యశాఖ అధికారులు
- హర్షం వ్యక్తం చేస్తున్న మత్స్యకారులు
- జిల్లాలో మత్స్య సహకార సంఘాలు 151
- వాటిలో మొత్తం 5,600 మంది సభ్యులు
- మొత్తం 778 చెరువులు, కుంటలు
- భారీ వర్షాలకు అలుగుపారుతున్న నీటి వనరులు



వికారాబాద్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): వర్షాకాలం ప్రారంభోత్సవం చేప పిల్లల పంపిణీకి మత్స్యశాఖ ఏర్పాట్లు చేసినా సరైన వర్షాలు పడక చెరువుల్లోకి నీరు చేరలేదు. దీంతో టెండర్ల ప్రక్రియ చేపట్టలేదు. వర్షాలు కురిసి చెరువుల్లోకి నీరు చేరుకున్న తర్వాత చేప పిల్లల పంపిణీ కార్యక్రమం ప్రారంభించాలని ప్రభుత్వం భావించింది. జూలై, ఆగస్టు నెలల్లో కురిసిన భారీ వర్షాలకు 75 శాతం చెరువులు అలుగెత్తి ప్రవహించగా, చాలా వరకు చెరువుల్లో పూర్తి స్థాయిలో నీరు చేరింది. అయితే ఈసారి కాంట్రాక్టర్ల నుంచి సరైన బిడ్లు రాక టెండర్ ప్రక్రియ పూర్తయ్యే సరికి చాలా ఆలస్యం జరిగింది. ఎట్టకేలకు టెండర్లు ఖరారు కావడం, చెరువులు నిండడంతో చేప పిల్లల పంపిణీ చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. జూలై, ఆగస్టులో చెరువుల్లోకి చేప పిల్లలను వదిలి ఉంటే అవి బాగా పెరిగేవని, అదును దాటడం వల్ల పెరుగుదలపై తీవ్ర ప్రభావం చూపుతుందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

నాలుగు రకాల చేప పిల్లలు

జిల్లాలో 778 చెరువుల్లో బొచ్చె, రవట, బంగారు తీగ, మృగాల రకాలకు చెందిన 1,29,72,000 చేప పిల్లలను వదలాలని జిల్లా మత్స్యశాఖ అధికారులు లక్ష్యం నిర్దేశించుకున్నారు. 45 రోజుల వయస్సు కలిగిన 35 నుంచి 40 మి.మీ. చేప పిల్లల్లో 35 శాతం బొచ్చె, 35 శాతం రవట, 30 శాతం బంగారు తీగ రకాల విత్తన చేప పిల్లలను సిద్ధం చేశారు. 75 రోజులు, అంతకంటే ఎక్కువ వయస్సు ఉండే 80 నుంచి 100 మి.మీ. చేప పిల్లల్లో 40 శాతం బొచ్చె, 50 శాతం రవట, 10 శాతం మృగాల విత్తన చేపలను చెరువుల్లో వదలాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. చేపపిల్ల కిలో బరువు పెరగాలంటే ఆరు నెలల సమయం పడుతుంది. జూన్, జూలై నెలలో చేపపిల్లలు వదిలితే డిసెంబర్ నుంచి వేటాడడానికి అనుకూలంగా ఉండేది. అక్టోబరు నెలలో చేప పిల్లలను చెరువుల్లో

మిగతా 8వ పేజీలో...


వాల్‌పోస్టర్‌ను విడుదల చేస్తున్న నిర్వాహకులు

కార్తీక మాసోత్సవాలను విజయవంతం చేస్తాం

కీసర, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): కీసరగుట్ట శ్రీ రామలింగేశ్వర స్వామి ఆలయంలో జరిగే కార్తీక మాసోత్సవాలను విజయవంతం చేస్తామని ఆలయ చైర్మన్ తటాకం నారాయణశర్మ అన్నారు. ఈ నెల 22వ తేదీ నుంచి నవంబర్ 20వ తేదీ వరకు జరిగే కార్తీక మాసోత్సవం పురస్కరించకొని మంగళవారం ఆలయ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇందుకు సంబంధించిన వాల్ పోస్టర్‌ను విడుదల చేశారు. అనంతరం చైర్మన్ మాట్లాడుతూ భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలుగకుండా తగిన ఏర్పాట్లు చేస్తామన్నారు. అదే విధంగా అష్టమిని పురస్కరించుకొని కాలభైరవ స్వామికి పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఈవో సుధాకర్‌రెడ్డి బోర్డు సభ్యులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి


సర్వీస్ రోడ్డులో నిలిచిన వరద నీటిని పరిశీలిస్తున్న కీర్తి భరద్వాజ్

ఘట్‌కేసర్ రూరల్, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): వరంగల్ - హైదరాబాద్ జాతీయ రహదారిలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేయనున్నట్లు ప్రాజెక్ట్ డైరెక్టర్ కీర్తి భరద్వాజ్ తెలిపారు. ఘట్‌కేసర్ మున్సిపాలిటీ, అవుశాపూర్ వద్ద జాతీయ రహదారిని మంగళవారం ఆయన పరిశీలించారు. చిన్నపాటి వర్షానికే సర్వీస్ రోడ్డులోని అండర్ పాస్ చెరువును తలపిస్తుందన్నారు. అలాగే వంతెనపై లైటింగ్ ఏర్పాటు చేయాలని మాజీ ఎంపీపీ ఏనుగు సుదర్శన్‌రెడ్డి పీడీ దృష్టికి తీసుకెళ్లారు. అంకుశాపూర్ హెచ్‌పీసీఎల్ వద్ద నూతనంగా నిర్మిస్తున్న అండర్‌పాస్ నిర్మాణంతో ట్రాఫిక్ సమస్య తీవ్రంగా ఉందన్నారు. వరదనీరు సాఫీగా వెళ్లడానికి ప్రత్యేక డ్రెయిన్ సిస్టంను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో అధికారులు, మాజీ ఎంపీటీసీ లక్ష్మారెడ్డి, నాయకులు ఏనుగు మశ్చేందర్ రెడ్డి, వెంకటేశ్, మహేశ్, భానుప్రకాశ్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

పురుగుల బియ్యం మాకొద్దు

కులకచర్లలో కార్డుదారుల ఆందోళన


రేషన్ దుకాణంలో నిల్వ ఉన్న దొడ్డు బియ్యం



కులకచర్ల, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): పురుగుల బియ్యం తమకొద్దని గ్రామాల్లో రేషన్‌కార్డు లబ్ధిదారులు ఆరోపిస్తున్నారు. చౌకధరల దుకాణాల్లో నిల్వ ఉన్న దొడ్డు బియ్యానికి పట్టిన లక్క పురుగు ఆ పక్కనే వేస్తున్న సన్న బియ్యానికి సైతం వ్యాప్తి చెందుతోందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రెండు రోజుల క్రితం కులకచర్ల మండలంలోని సాల్విడ్ గ్రామ రేషన్ దుకాణంలో ఈ సంఘటన చోటు చేసుకుంది. ఆరు నెలలుగా ముక్కి మూలుగుతున్న దొడ్డు బియ్యానికి ఇంకా మోక్షం కలగడం లేదు. ఇంకా కొన్ని రోజులు వీటిని ఇలాగే వదిలేస్తే ఎందుకు పనికి రాకుండా పోయే పరిస్థితి ఉంది. చాలా రేషన్ దుకాణాల్లో 20 నుంచి 30 క్వింటాళ్ల వరకు దొడ్డు బియ్యం నిల్వలు ఉన్నాయి. రెండు నెలల క్రితం ప్రభుత్వం ఈ బియ్యాన్ని తిరిగి తీసుకోనున్నట్లు ప్రకటించినప్పటికీ ఇప్పటి వరకు వాటి జోలికి వెళ్లలేదు. త్వరగా దొడ్డు బియ్యం ఖాళీ చేయించి విక్రయిస్తే ప్రభుత్వానికి ఆదాయం సమకూరే అవకాశం ఉంది. ఇప్పటికే బియ్యం బస్తాలకు చెద, పురుగులు పట్టి పనికిరాకుండా పోతున్నాయి. స్థలం కొరతకు తోడు పురుగులు, ఎలుకల సంచారంతో తరుగును ఎలా భర్తీ చేయాలో తెలియక డీలర్లు మల్లగుల్లాలు పడుతున్నారు.

కొడంగల్ అభివృద్ధిపై సీఎం ప్రత్యేక దృష్టి

జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేశ్‌రెడ్డి


లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేస్తున్న రాజేశ్‌రెడ్డి

బొంరాస్‌పేట్, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): కొడంగల్ అభివృద్ధిపై సీఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేక దృష్టి సారించారని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేశ్ రెడ్డి తెలిపారు. మంగళవారం మండల కేంద్రంలో 35 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొడంగల్ నియోజకవర్గంలో ఎన్నడూ లేని విధంగా అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయన్నారు. ప్రతీ గ్రామానికి డబుల్ రోడ్డు, అంతర్గత సీసీ రోడ్లతో పాటు అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణాలు చేపడుతున్నట్లు తెలిపారు. ప్రతీ మండలానికి ఒక జూనియర్ కళాశాలను ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో తహసీల్దార్ పద్మావతి, ఎంపీడీవో వెంకన్నగౌడ్, ఎంపీవో రవినాయక్, ఆర్‌ఐ శిరీష, ఉపాధిహామీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు నర్సిములుగౌడ్, నాయకులు రాంచంద్రారెడ్డి, అంజిల్‌రెడ్డి, వెంకట్రాములుగౌడ్, నాందర్‌పూర్ మల్లికార్జున్, వీరేశం, నర్సిములు నాయుడు, మల్లికార్జున్, కాశప్ప పాల్గొన్నారు.

‘ఎన్‌ఎఫ్‌బీఎస్’ ద్వారా ఆర్థిక సాయం


మేడ్చల్ కలెక్టర్ మను చౌదరి


మేడ్చల్, అక్టోబర్ 14(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): జాతీయ కుటుంబ ప్రయోజన పథకం(ఎన్‌ఎఫ్‌బీఎస్) ద్వారా దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న కుటుంబాలకు, వారి కుటుంబ పోషకుడు మరణిస్తే ఆ కుటుంబానికి పోషణ నిమిత్తం రూ.20 వేల సహాయం అందుతుందని కలెక్టర్ మను చౌదరి మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. 18 నుంచి 60 సంవత్సరాలలోపు ఉన్న వారు మరణించిన సందర్భంలో ఈ పథకం వర్తిస్తుందన్నారు. తెల్ల రేషన్ కార్డు కలిగి ఉండి, అర్హులైన వారు వారి పరిధిలోని మండల తహసీల్దార్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకుని కేంద్ర ప్రభుత్వం జాతీయ కుటుంబ ప్రయోజనం పథకం ద్వారా లబ్ధి పొందాలని కలెక్టర్ సూచించారు.

భూములు లాక్కుంటే ఊరుకోం.. 7

ట్రిపుల్‌ఆర్ అలైన్‌మెంట్‌పై పులుసుమామిడి రైతుల ఆందోళన

అంబేడ్కర్ గృహాన్ని సందర్శించడం గొప్ప అదృష్టం

లండన్ పర్యటనలో శాసన సభ స్పీకర్ ప్రసాద్‌కుమార్


విజిటర్స్ బుక్‌లో సందేశం రాస్తున్న స్పీకర్

వికారాబాద్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): భారతరత్న, రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీ.ఆర్. అంబేడ్కర్ నివసించిన ఇంటిని సందర్శించడాన్ని గొప్ప అదృష్టంగా భావిస్తున్నాని స్పీకర్ ప్రసాద్‌కుమార్ అన్నారు. ఆయన ఆశీర్వాదంతోనే తాను స్పీకర్ అయినట్లు గుర్తు చేసుకున్నారు. లండన్ నగరంలోని కింగ్స్ హెన్రీ రోడ్డులో 1921-22 సంవత్సరంలో అంబేడ్కర్ నివసించిన గృహాన్ని మంగళవారం స్పీకర్ సందర్శించారు. అంబేడ్కర్ జ్ఞాపకార్థం ఆయన నివాసాన్ని మ్యూజియంగా మార్చిన ప్రభుత్వానికి ఆయన అభినందనలు తెలిపారు. ముందుగా అంబేడ్కర్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాలలర్పించిన స్పీకర్ అనంతరం ఆయన ఉపయోగించిన లైబ్రరీ, పడక గది, ఫొటో గ్యాలరీ, వ్యక్తిగత వస్తువులను పరిశీలించారు. అనంతరం విజిటర్స్ పుస్తకంలో సభాపతి తన సందేశాన్ని రాశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ మ్యూజియాన్ని సక్రమంగా నిర్వహిస్తున్న భారత ప్రభుత్వానికి హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. ఆయనతో పాటు శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాశ్ ముదిరాజ్, లెజిస్లేటివ్ సెక్రటరీ వి.నర్సింహాచార్యులు, స్పీకర్ ఓఎస్‌డీ వెంకటేశం తదితరులు ఉన్నారు.


అంబేడ్కర్ గృహంలో స్పీకర్ ప్రసాద్‌కుమార్, మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి

సబ్సిడీ విత్తనాలను సద్వినియోగం చేసుకోవాలి

జిల్లా వ్యవసాయాధికారి రాజారత్నం


విత్తనాలు పంపిణీ చేస్తున్న డీఏవో రాజారత్నం

దోమ, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం సబ్సిడీపై ఇస్తున్న వేరుశనగ విత్తనాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి రాజారత్నం సూచించారు. మంగళవారం దోమ మండలంలోని దాదాపూర్, బ్రహ్మణపల్లి, గంజిపల్లి, బుద్లాపూర్ గ్రామాల్లో 50, 100శాతం సబ్సిడీతో విత్తనాలను రైతులకు పంపిణీ చేశారు. అనంతరం మల్లెపల్లి గ్రామంలో వరి పంటను పరిశీలించారు. కార్యక్రమంలో ఏడీఏ లక్ష్మీకుమారి, ఏవో ప్రభాకర్‌రావు, సొసైటీ చైర్మన్ యాదవరెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు విజయ్‌కుమార్‌రెడ్డి, పరిగి మార్కెట్ కమిటీ డైరెక్టర్ శాంత్‌కుమార్, నాయకులు యాదయ్యగౌడ్, ఏఈవోలు చెన్నయ్య, బాబ్య, హరిక, శ్రవణ్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత విత్తనాలు దళారుల పాలు

- బహిరంగ మార్కెట్‌కు వేరుశనగ విత్తనాలు
- రైతుల పాస్‌బుక్స్‌తో వ్యాపారుల హస్తగతం
- అదనుదాటడంతో ముందుకు రాని రైతులు
- బొంరాస్‌పేట్ మండలంలో ఇష్టారాజ్యం


బొంరాస్‌పేట్‌లోని గోదాంలో నిల్వ ఉంచిన వేరుశనగ విత్తనాలు (ఫైల్)

బొంరాస్‌పేట్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం నూనె గింజల అభివృద్ధిలో భాగంగా తీసుకొచ్చిన ఉచిత వేరుశనగ విత్తనాల పంపిణీ కార్యక్రమం బొంరాస్‌పేట్ మండలంలో అభాసుపాలైంది. సరైన మార్గదర్శకాలు లేకపోవడంతో విత్తన కొనుగోలుకు రైతులెవరూ ముందుకు రాలేదు. దీంతో వందల బస్తాల వేరుశనగలు బహిరంగ మార్కెట్‌లో ప్రత్యక్షమయ్యాయి. రైతుల పాస్‌బుక్కులతో దళారులు వాటిని దక్కించుకొని విక్రయిస్తున్న పరిస్థితి. దాదాపు 2,500 బస్తాల విత్తనాలు బొంరాస్‌పేట్ మండల కేంద్రంలోని గోదాంలో నిల్వ ఉంచారు. ఈ విత్తనాలను మెట్లకుంట క్లస్టర్‌లోనే పంపిణీ చేయాలనే నిబంధన ఉంది. కానీ అక్కడి రైతులు ఎవరూ ముందుకు రాకపోవడంతో చాలా రోజులుగా గోదాంలో నిల్వ ఉంచారు. ఆసక్తి గల కొంత మంది రైతులు మెట్లకుంట రైతుల పాస్ పుస్తకాలతో కొనుగోలు చేశారు. కాగా, అప్పటికే అదును దాటి పోవడం రైతులు ఆసక్తి చూపలేదు.

క్వింటాల్‌కు రూ. 5వేల వరకు..

దీంతో చేసేది ఏమి లేక వ్యవసాయ శాఖ అధికారులు సెలవు రోజులు రెండో శనివారం, ఆదివారం

మిగతా 8వ పేజీలో...


రైల్వే మంత్రి నుంచి పతకాన్ని అందుకుంటున్న ఎస్‌ఐ సుధాకర్

ఆర్‌పీఎఫ్ ఎస్‌ఐకి భారత పోలీస్ పతకం

వికారాబాద్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): జిల్లాకు చెందిన ఆర్‌పీఎఫ్ సబ్ ఇన్‌స్పెక్టర్ జాలా సుధాకర్ ప్రతిష్ఠాత్మక భారత పోలీస్ పతకాన్ని అందుకున్నారు. గుజరాత్‌లోని వలసాద్‌లో మంగళవారం జరిగిన ఆర్‌పీఎఫ్ రైజింగ్ డే కార్యక్రమంలో రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ నుంచి ఈ అవార్డును స్వీకరించారు. సుధాకర్ సేవలు, క్రమశిక్షణ, విశిష్ట కర్తవ్య నిర్వహణకు గుర్తింపుగా ఈ పురస్కారం లభించింది.

ప్రజాస్వామ్యాన్ని కాలరాస్తున్న బీజేపీ



ఆమనగల్లులో సంతకాల సేకరణ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న నాయకులు

ఆమనగల్లు/కడ్తాల్, అక్టోబరు14(ఆంధ్రజ్యోతి): దేశంలో బీజేపీ ఓటు చోరీకి పాల్పడుతూ ప్రజాస్వామ్యాన్ని కాలరాస్తోందని కాంగ్రెస్ జిల్లా నాయకుడు మండ్లీ రాములు, మార్కెట్ కమిటీ మాజీ వైస్‌చైర్మన్ కేశవులు, కాంగ్రెస్ పట్టణాధ్యక్షుడు వస్పుల మానయ్య ఆరోపించారు. రాహుల్‌గాంధీ చేపడుతున్న పోరాటంలో ప్రతి ఒక్కరు భాగస్వాములై బీజేపీ కుట్రలకు అడ్డుకోవాలని పిలుపునిచ్చారు. ఆమనగల్లులో మంగళవారం సంతకాల సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకలు, కార్యకర్తలు పాల్గొన్నారు. రాములు, కేశవులు సంతకాల సేకరణ చేపట్టారు. కాంగ్రెస్ అనుకూల ప్రాంతాల్లో బీజేపీ ఓటు చోరీకి పాల్పడుతోందని ఆరోపించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా, మండల నాయకులు కాలె మల్లయ్య, బధ్ధి వెంకటేశ్, మల్లేశ్‌నాయక్, రామకృష్ణ శ్రీనునాయక్, లక్ష్మయ్య పాల్గొన్నారు. అలాగే కడ్తాల్ మండలం మక్తమాదారంలో యువజన కాంగ్రెస్ కల్వకుర్తి నియోజకవర్గ ఉపాధ్యక్షుడు షాబుద్దీన్ ఆధ్వర్యంలో సంతకాల సేకరణ నిర్వహించారు. కేంద్ర ఎన్నికల కమిషన్ బీజేపీకి అనుకూలంగా పనిచేస్తుందని ఆరోపించారు. కార్యక్రమంలో నాయకులు సురేశ్, రమేశ్, క్రాంతి, కరీం, సమీర్, అశ్విని, మంజుల, నవాజ్ తదితరులు పాల్గొన్నారు.

అతి.. అనర్థమే!

పిల్లలు యూట్యూబ్ ఎక్కువగా వీక్షిస్తే దుష్పరిణామాలు

- స్ర్కీన్‌కు అడిక్ట్ అయ్యే అవకాశం
- సబ్జెక్ట్ కంటెంట్ ఉన్న వీడియోలతో ప్రయోజనం
- తల్లిదండ్రులు జాగ్రత్తలు పాటించాలంటున్న నిపుణులు



చేవెళ్ల, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): యూ ట్యూబ్.. ఆధునిక కాలంలో ఈ సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ తెలియని వారుండరంటే అతిశయోక్తి కాదు. ఇందులో ప్రతీ ఒక్కరికి కావాల్సిన సమాచారం వీడియో, ఆడియో రూపంలో లభిస్తుంది. ప్రధానంగా పిల్లలకు పద్యాలు, వీడియో గేమ్‌లు అధికంగా అందుబాటులో ఉంటాయి. అందుకే తల్లిదండ్రులు పిల్లలకు ఫోన్‌లో పద్యాలు చూపిస్తూ యూట్యూబ్ వీక్షణాన్ని అలవాటు చేస్తున్నారు. కానీ ఈ అలవాటు వల్ల భవిష్యత్‌లో జరిగే నష్టం గురించి ఆలోచించడం లేదనే అభిప్రాయం వ్యక్తం అవుతోంది. యూట్యూబ్ వినియోగంలో జాగ్రత్తలు తీసుకోకుంటే పిల్లలపై దుష్ప్రభావం పడుతుంది. పిల్లలు గంటలకొద్దీ యూట్యూబ్ చూస్తే కలిగే అనర్థాలపై ఓ సారి పరిశీలిస్తే.. సాధారణంగా ఎక్కువ మంది పిల్లలు యూ ట్యూబ్‌లో వీడియో చూపిస్తే గానీ అన్నం తినం అంటూ మారాం చేస్తుంటారు. తల్లిదండ్రులు సైతం ఫోన్‌ను చూపిస్తుంటారు. అయితే పిల్లలు స్ర్కీన్‌కు అడిక్ట్ అవుతున్నారనే విషయాన్ని గుర్తించడం లేదు. చిన్న వయసులోనే స్ర్కీన్‌కు అడిక్ట్ అయితే భవిష్యత్‌లో దుష్ప్రరిణామాలు తలెత్తుతాయి. వయసు పెరిగేకొద్దీ కుటుంబీలు, స్నేహితులతో గడపడం తగ్గి సోషల్ మీడియాతోనే గడుపుతారు.

ఎదిగే పిల్లలు ఫోన్ వాడుతుంటే...

పిల్లల విషయం అలా ఉంచితే కొన్ని సందర్భాల్లో ఎదిగే పిల్లలు తల్లిదండ్రుల ఫోన్ వాడుతుంటారు. ఆ సమయంలో జాగ్రత్తగా ఉండాలి. ముఖ్యంగా యూట్యూబ్ వంటి అప్లికేషన్లు మెషిన్‌లెర్నింగ్ అల్గారిథమ్స్ అనుసరిస్తుంటాయి. ఎక్కువగా ఎలాంటి వీడియోలు చూస్తే వాటినే మళ్లీమళ్లీ చూపిస్తుంటాయి. సెన్సేషనల్ కంటెంట్ యూట్యూబ్‌లో చూసిన తర్వాత ఫోన్ పిల్లలకు ఇస్తే వారికి కూడా అలాంటి వీడియోలే వస్తాయి. దీంతో వాళ్లకు కావాల్సిన ఇతర వీడియోల కోసం ప్రత్యేకంగా వెతుక్కోవాలి. ఎదిగే పిల్లలు ఉంటే ఫోన్‌లో వారి కోసం సెకండ్ స్పేస్ యాప్స్ ద్వారా మరో యూట్యూబ్ యాప్‌ను ఇన్‌స్టాల్ చేసివ్వాలి.

ఆన్‌లైన్‌లో కోర్సులు...

యూట్యూబ్‌లో ఒక్కటే కాదు. యూ డెమీ వంటి అనేక పోర్టల్‌లో వివిధ అంశాలకు సంబంధించి ఉచిత, నామమాత్ర రుసుముతో పెయిడ్ కోర్సులు లభిస్తుంటాయి. వాటిలో ఎన్రోల్ అయితే మీ పిల్లలు చిన్న వయసులోనే అనేక అంశాలకు సంబంధించి నైపుణ్యాన్ని పెంచుకునేందుకు అవకాశం ఉంటుంది. బ్రెయిన్ పవర్, మెమొరీ పెంచుకోవడం, ప్రొడక్టవిటీ, టైమ్, స్ర్టెస్ మేనేజ్‌మెంట్, పర్సనల్ డెవలంప్‌మెంట్, ఆర్ట్స్, క్రాఫ్ట్‌లకు సంబంధించిన కోర్సులు లభిస్తాయి.

టైమ్ ట్రాకింగ్‌కు సరికొత్త యాప్స్...

అన్నిటి కంటే సమయం విలువైంది. దీనిని ఎంత సమర్థంగా వినియోగించుకుంటే అంత మంచి ఫలితాలు సాధించొచ్చు. గంటల తరబడి కంప్యూటర్ చూసే వారు వీలైనంత ప్రొడక్టివ్‌గా ఉండేలా జాగ్రత్త వహించాలి. మనకు తెలియకుండానే టైం ఎక్కడ వృథా చేస్తున్నారో గమనించాలి. దీని కోసం అనేక టైం ట్రాకింగ్ యాప్‌లు అందుబాటులో ఉన్నాయి.

హబ్ స్టఫ్...

ఇది వివిధ వెబ్‌సైట్లను ఓపెన్ చేసిన తర్వాత వాటిపై మనం ఎంత సమయం గడుపుతున్నామనే వివరాలు చూపుతుంది. ఎప్పటికప్పుడు రాండమ్ స్ర్కీన్ షాట్‌లను క్యాప్చర్ చేస్తుంది. కంప్యూటర్‌లో ఎక్కువ వాడుతున్న యాప్స్‌పై రిపోర్ట్ చూపిస్తుంది.

టోగెల్...

ఇది కూడా రియల్ టైం ఇంటర్నెట్‌లో మీరు స్పెండ్ చేస్తున్న వివిధ అంశాల మీద టైమ్ రిపోర్టులు చూపుతుంది. మీ సమయాన్ని ప్రాజెక్టులు, ట్యాగ్‌ల ఆధారంగా ఆర్గనైజ్ చేసుకోవచ్చు. అలాగే టైమ్ షీట్లను డిజైన్ చేసుకోవచ్చు.

హర్వెస్ట్...

మార్కెట్‌లో బాగా పాపులర్ టైం ట్రాకింగ్ సర్వీస్. డెస్క్‌టాప్ కంప్యూటర్లు, స్మార్ట్‌ఫోన్లు చివరకు స్మార్ట్ వాచ్‌లో ఇది టైమ్ ట్రాకింగ్ సదుపాయాలు అందజేస్తుంది. సిస్టం లేదా ప్రోగ్రాంలో వెచ్చించిన సమయం ఆధారంగా క్లయింట్ల నుంచి ఫీ వసూలు చేసే సంస్థలకు ఇది ఉపయోగకరం.

ట్రాకింగ్ టైమ్...

గూగల్ క్రోమ్ ఎక్స్‌టెన్షన్ రూపంలో ఇది లభిస్తుంది. రోజు మొత్తంలో సమయం ఎలా వెచ్చిస్తున్నారనే విషయాన్ని ఇది రిపోర్టు రూపంలో చూపిస్తుంది. మెయిన్ స్ర్కీన్‌లో టాస్క్‌లను క్రియేట్ చేసుకోవచ్చు. ఎడిట్ చేయొచ్చు. కొలాబరేట్ చేసుకోవచ్చు.

అసభ్యకర వీడియోలు రాకుండా..

ఎన్ని జాగ్రత్తలు తీసుకున్నా యూట్యూబ్‌లో కొన్నిసార్లు అసభ్యకర వీడియోలు కనిపిస్తుంటాయి. ఇవి రాకుండా ప్రత్యేక సెట్టింగ్ ఉంటుంది. దీనిని ఎనేబుల్ చేసుకోవాలి. మీ ఫోన్‌లో యూట్యూబ్ అప్లికేషన్ ఓపెన్ చేసి అందులో సెట్టింగ్స్‌లో జనరల్‌లోకి వెళ్లి రిస్ట్రిక్టెడ్ మోడ్ అనే పదాన్ని ఎనేబుల్ చేయాలి. దీంతో పిల్లలు చూసేందుకు ఇబ్బందికరంగా ఉన్న వీడియోలు వాటంతట అవే డిజేబుల్ అవుతాయి.

చిన్నారులకు ప్రత్యేక వీడియోలు ..

చిన్నారులను ఆకర్షించేందుకు యూట్యూబ్ గేమింగ్ థీమ్ పోర్టల్‌లో ట్విచ్‌తో డీల్ కుదుర్చుకుంది. దీని ప్రకారం 60 ఫ్రేమ్స్ పర్ సెకండ్ వీడియోలను యూట్యూబ్ పరిచయం చేసింది. వీడియో గేమ్స్‌తో సమానమైన ఫ్రేమ్స్ యూట్యూబ్‌లో అన్ని రకాల వీడియోలు కనిపిస్తాయి. వీటితో పిల్లల మనసు ప్రభావితమవుతుంది. ఈ నేపథ్యంలో ప్రత్యేకంగా పిల్లల కోసం యూట్యూబ్ కిడ్స్ అప్లికేషన్ లభిస్తుంది. గూగుల్ ప్లేస్టోర్ నుంచి ఇన్‌స్టాల్ చేసుకోవాలి. పిల్లలకు ఫోన్ ఇవ్వాల్సి వచ్చినప్పుడు అప్లికేషను ఓపెన్ చేసిస్తే చాలు. ఇందులో పిల్లలకు ఉపయోగపడే ఎడ్యుకేషనల్ కంటెంట్ మాత్రమే లభిస్తుంది.

నైపుణ్యాన్ని పెంచుకునేందుకు

యూట్యూబ్‌లో కమ్యూనికేషన్ స్కిల్స్ డెవలప్ చేసుకునేందుకు వివిధ సబ్జెక్టుల కంటెంట్ వీడియోలు లభిస్తాయి. పిల్లలు ఇలాంటి వీడియోలు చూడటం ద్వారా ప్రపంచలోని గొప్ప యూనివర్సిటీలు, ప్రొఫెసర్ల టీచింగ్‌తో తమ రంగాలకు సంబంధించిన సబ్జెక్టును నేర్చుకునే అవకాశం ఉంటుంది.

యూట్యూబ్‌తో మంచీ.. చెడూ ఉన్నాయి



ఈ రోజుల్లో పిల్లలు ఆటాపాటలు వదిలి సెల్‌ఫోన్ చూసేందుకు ఆసక్తి చూపుతున్నారు. యూట్యూబ్ చూడటాన్ని అలవాటుగా మార్చుకున్నారు. ఇది సరికాదు. యూట్యూబ్‌తో లాభాలు ఎన్నున్నాయో నష్టాలూ ఉన్నాయి. చిన్న వయసులోనే స్ర్కీన్‌కు అలవాటు పడితే భవిష్యత్తులో ఇబ్బందులు తప్పవు. ఈ విషయాన్ని గుర్తించి తల్లిదండ్రులు పిల్లలను కనిపెడుతుండాలి.

- డాక్టర్ రాజేంద్రప్రసాద్, చేవెళ్ల ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్

పేదల శ్రేయస్సుకు సీఎం కృషి



లబ్ధిదారులకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

ఆమనగల్లు, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): రాష్ట్రాభివృద్ధి, పేదల శ్రేయస్సు కోసం సీఎం రేవంత్‌రెడ్డి నిరంతరం పాటుపడుతున్నారని, నూతన సంస్కరణలతో పథకాలను,కార్యక్రమాలను అమలుచేస్తున్నారని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి తెలిపారు. ఆమనగల్లు, కడ్తాల మండలాల్లో మంగళవారం ఎమ్మెల్యే పర్యటించి అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ప్రజల ఆకాంక్షలకనుగుణంగా ప్రభుత్వం పథకాలను అమలు చేస్తోందని చెప్పారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో కార్పొరేట్ స్థాయి వైద్యాన్ని అందిస్తున్న ఘనత సీఎం రేవంత్‌రెడ్డికే దక్కిందన్నారు. కల్వకుర్తి నియోజకవర్గంలోని అన్ని ఆస్పత్రులను ఆధునికీకరిస్తున్నట్టు చెప్పారు. కడ్తాలలో త్వరలో పీహెచ్‌సీని ఏర్పాటు చేస్తామన్నారు. మైసిగండి, గట్టిప్పలపల్లి, ఇర్విన్, మాడ్గుల, తలకొండపల్లి ఆస్పత్రుల స్థాయి పెంపునకు ప్రతిపాదనలు పంపినట్లు తెలిపారు. అభివృద్ధిలో రాజకీయాలకు తావు లేదని, ఇందులో ప్రజలంతా పాలు పంచుకోవాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు సురేందర్‌రెడ్డి, నరేందర్, గణేశ్, శ్రీరాములు, రమేశ్, రాఘవేందర్, జైపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కళాశాలకు స్థలం కేటాయించాలని వినతి

తలకొండపల్లి:తలకొండపల్లిలో ప్రభుత్వ జూనియర్ కళాశాల భవన నిర్మాణానికి స్థలం కేటాయించాలని ఉన్నతి శిక్షా ఫౌండేషన్ వ్యవస్థాపకులు ఎర్ర శ్రీనివాస్‌రెడ్డి, చైర్మన్ ఎర్ర సుధాకర్‌రెడ్డిలు కోరారు. మంగళవారం వారు కలెక్టరేట్‌లో కలెక్టర్ నారాయణరెడ్డికి వినతి పత్రం ఇచ్చారు. మండలంలో ప్రభుత్వ పాఠశాలల్లో వసతుల కల్పనకు, విద్యార్థుల ఉన్నతికి ఉన్నతి శిక్షా ఫౌండేషన్ పాటుపడుతోందని చెప్పారు. ఎన్నారై శ్రీనివాస్‌రెడ్డి జూనియర్ కళాశాల భవన నిర్మాణానికి తోడ్పాటునందించేందుకు ముందుకొచ్చారు.ప్రభుత్వం స్థలం కేటాయిస్తే భవన నిర్మాణం చేపడుతామని ఆయన కలెక్టర్‌తో చెప్పారు. స్పందించిన కలెక్టర్ ప్రభుత్వ స్థలాలను పరిశీలించి కాలేజీ నిర్మాణానికి వీలైనంత త్వరలో భూమి కేటాయించేలా అధికారులను ఆదేశిస్తామని చెప్పారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో ఫౌండేషన్ కార్యదర్శి బండి రఘుపతి, చంద్రకుమార్ ఉన్నారు. అలాగే ఎమ్మెల్యే నారాయణరెడ్డిని హైదరాబాద్‌లోని శ్రీనివాస్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి కలిశారు. కాలేజీకి స్థలాన్ని కేటాయించాలని కోరారు. స్పందించిన ఎమ్మెల్యే స్థలం కేటాయింపుకు సర్వే చేయాలని అధికారులకు ఆదేశించారు.



కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం ఇస్తున్న శ్రీనివాస్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి

పాఠశాలల తనిఖీకి టీచర్లను వినియోగించొద్దు



మాట్లాడుతున్న టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు వెంకటరత్నం

వికారాబాద్, అక్టోబరు14(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని పాఠశాల విద్యా వ్యవస్థ బలోపేతానికి ప్రభుత్వ చర్యలను స్వాగతిస్తున్నామని, అయితే ఈ కార్యక్రమంలో రెండుశాతం ఉపాధ్యాయులను వినియోగించడం సరికాదని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు వెంకటరత్నం అన్నారు. మంగళవారం వికారాబాద్‌లో నిర్వహించిన జిల్లా సమావేశంలో ఆయన మాట్లాడారు. పాఠశాలల తనిఖీకి టీచర్లను వినియోగించడం అశాస్ర్తీయమని, దీనితో జూనియర్-సీనియర్ల మధ్య విభేదాలు తలెత్తే అవకాశం ఉందన్నారు. అలాగే టీచర్లు తనిఖీలకు వెళ్తే బోధన కుంటుపడుతుందని, వాస్తవ నివేదికలు అందకపోవచ్చని అభిప్రాయపడ్డారు. కాబట్టి మండలానికి ఒక అకడమిక్ ఎంఈవో, ప్రతీ రెవెన్యూ డివిజన్‌కు ఒక డిప్యూటీ ఈవోను నియమించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ప్రధాన కార్యదర్శి రాములు, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

నేటి నుంచి గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు

మోమిన్‌పేట్, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): పశువుల్లో గాలికుంటు వ్యాధి నివారణకు బుధవారం నుంచి వ్యాధి నిరోధక టీకాలు వేయనున్నట్లు పశువైద్యురాలు గీత మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. మోమిన్‌పేట్ మండలంలోని అన్ని గ్రామాల్లో పశువులకు ఉచితంగా వ్యాధి నివారణ టీకాలు వేయనున్నట్లు ఆమె తెలిపారు. రైతులు పశువులకు టీకాలు వేయించాలని సూచించారు. టీకాలు వేయించడంతో పశువుల్లో వ్యాధుల బారినపడకుండా ఉంటాయని పేర్కొన్నారు.

అందుబాటులో సబ్సిడీ విత్తనాలు

దుద్యాల్, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం సబ్సిడీపై అందిస్తున్న వేరుశనగ విత్తనాలు అందుబాటులో ఉన్నాయని, రైతులు తీసుకోవాలని వ్యవసాయ శాఖ అధికారులు తెలిపారు. మంగళవారం పోలెపల్లి క్లస్టర్ హకీంపేట్ రైతు వేదికలో నిర్వహించిన రైతునేస్తం కార్యక్రమంలో రాష్ట్ర వ్యాసాయ శాఖ అధికారులు మాట్లాడారు. వేరుశనగ విత్తనాలను రైతులకు మండల కేంద్రాల్లో ఉంచినట్లు తెలిపారు. విత్తనాలు కావాల్సిన రైతులు అధికారులను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమానికి హాజరైన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఆవుటి శేఖర్, హకీంపేట్ శ్రీనివాస్‌రెడ్డిలు మాట్లాడుతూ.. విత్తనాలను వ్యవసాయ అధికారులు అర్హులైన రైతులకే ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ వేణుగోపాల్, కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటయ్య, నాయకులు రవినాయక్, సత్యనారాయణ, కృష్ణ పాల్గొన్నారు.

వేరుశనగ కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయాలి



మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావుకు వినతిపత్రం ఇస్తున్న ఏఎంసీ చైర్మన్ యాట గీతానర్సింహ

ఆమనగల్లు, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి):ఆమనగల్లు మార్కెట్ యార్డ్‌లో కంది, మొక్కజొన్న, వేరుశనగ కొనుగోలు కేంద్ర ఏర్పాటుకు అనుమతించాలని వ్యవసాయ, మార్కెటింగ్ శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావును మార్కెట్ చైర్‌పర్సన్ యాట గీతనర్సింహ కోరారు. మంగళవారం హైదరాబాద్‌లోని సచివాలయంలో మంత్రిని కలిసి వినతిపత్రం ఇచ్చారు. కొనుగోలు కేంద్రాలు లేక పంటలను అమ్ముకోవడానికి రైతులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. మార్కెట్ యార్డ్‌కు కూడా ఆదాయం వస్తుందని గీత తెలిపారు. స్పందించిన మంత్రి కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు అనుమతులిస్తామని అన్నారని గీత పేర్కొన్నారు. యార్డ్‌లో అభివృద్ధి పనులకు, రైతులకు సదుపాయాల కల్పనకు, కడ్తాలలో గోదాంల నిర్మాణానికి నిధులు కేటాయించాలని మంత్రిని కోరినట్లు చెప్పారు. పూర్తి సబ్సిడీపై వేరుశనగ విత్తనాలను గీతనర్సింహ ఆమనగల్లు, తలకొండపల్లి మండలాల రైతులకు పంపిణీ చేశారు. మంత్రిని కలిసిన వారిలో తలకొండపల్లి ప్యాక్స్ చైర్మన్ గట్ల కేశవరెడ్డి, ఆమనగల్లు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ, నాయకులు కృష్ణయ్య, దుర్గని జంగయ్య ఉన్నారు.

మార్కెట్ యార్డ్‌ను తీర్చి దిద్దుతాం

ఆమనగల్లు మార్కెట్ యార్డ్‌ను అభివృద్ధి పరిచి ఆదర్శంగా నిలుపుతామని మార్కెట్ చైర్‌పర్సన్ గీతనర్సింహ అన్నారు. మార్కెట్ కమిటీ సమావేశాన్ని మంగళవారం నిర్వహించారు. యార్డ్‌లో ఓపెన్ ప్లాట్‌ఫామ్‌లపై షెడ్లు నిర్మించాలని, యార్డ్ గోదాంకు మరమ్మతులు చేయాలని, గోదాం పక్కన సీసీ రోడ్డుకు తీర్మానించారు. పలు పనులపై రాష్ట్ర వ్యవసాయ మార్కెటింగ్ శాఖకు పంపుతామని గీత తెలిపారు. వేరుశనగ, మొక్కజొన్న, కంది కొనుగోళ్లకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. రైతులు యార్డు సేవలను వినియోగించుకోవాలని, వారికి వసతులు కల్పిస్తామన్నారు. సమావేశంలో మార్కెట్ వైస్‌చైర్మన్ గూడూరు భాస్కర్‌రెడ్డి, కార్యదర్శి శ్రీనివా స్‌రెడ్డి, సూపర్వైజర్ రాజేశ్వరి, డైరెక్టర్లు రమేశ్, నరేశ్‌నాయక్, జంగయ్య, యాదయ్య సంపత్‌కుమార్, శ్యామ్‌సుందర్‌రెడ్డి, అజీం, శ్రీశైలం, వెంకట్‌రెడ్డి, రవీందర్, అంజయ్య, పాండురంగయ్య, పాల్గొన్నారు.

విభజన హామీల అమలులో కేంద్రం విఫలం



సమావేశంలో మాట్లాడుతున్న రవిశంకర్‌రెడ్డి

కొడంగల్ రూరల్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): విభజన హామీల అమలులో కేంద్ర ప్రభుత్వం విఫలమైందని రేవల్యూషనరీ విద్యార్థి సంఘం జాతీయ అధ్యక్షుడు రవిశంకర్‌రెడ్డి అన్నారు. మంగళవారం కొడంగల్‌లో రాష్ట్ర అధ్యక్షుడు భీమరాజు అధ్యక్షతన నిర్వహించిన తెలంగాణ రాష్ట్ర కమిటీ సమావేశానికి హాజరైన రవిశంకర్‌రెడ్డి మాట్లాడుతూ... 2014లో ఆంధ్రప్రదేశ్ రెండు రాష్ట్రాలుగా విభజించిన క్రమంలో అప్పటి కేంద్ర ప్రభుత్వం, ప్రతి పక్షంలో ఉన్న బీజేపీ రెండు రాష్ట్రాలకు నిధులు, నియామకాల్లో అనేక హామీలు ఇచ్చాయన్నారు. 2014 నుంచి బీజేపీ ప్రభుత్వం ఏ ఒక్క హామీని అమలు చేయలేదని ఆరోపించారు. తెలుగు రాష్ట్రాలకు నిధులు కేటాయించడం లేదని అన్నారు. కేంద్ర స్థాయి విద్యాసంస్థలను ఏర్పాటు చేయడం లేదని వాపోయారు. ఆర్ఎస్‌యూ ఆధ్వర్యంలో ఢిల్లీ వేదికగా రెండు రాష్ట్రాల విద్యార్థుల సమస్యలతో పాటుగా నిరుద్యోగ సమస్యలు, విభజన హామీల అమలుకు పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామన్నారు. కార్యక్రమంలో విద్యార్థి నాయకులు శ్రీనివాస్, అశోక్, మహేష్, రాము, వెంకటేష్ పాల్గొన్నారు.

ఉద్యాన పంటలకు ప్రభుత్వ ప్రోత్సాహం



పలుగుట్టలో రైతులకు అవగాహన కల్పిస్తున్న హార్టికల్చర్ విద్యార్థులు

చేవెళ్ల, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ఉద్యాన పంటల సాగును ప్రోత్సహిస్తోందని ఉద్యాన విశ్వవిద్యాలయ విద్యార్థులు తెలిపారు. క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా చేవెళ్ల మండలం పలుగుట్టలో మంగళవారం పర్యటించారు. రైతులు సాగుచేస్తున్న పంటలను పరిశీలించారు. ఉద్యాన పంటలపై వివరించారు. కార్యక్రమంలో విద్యార్థినులు ప్రేసి, భావన, శివాని, మేఘన, వినూత్న, హర్షిత, మానస, కీర్త, రైతులు బుచ్చిరెడ్డి, శేఖర్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, విశ్వనాథ్‌రెడ్డి, సుభాష్‌రెడ్డి, లక్ష్మణ్‌రెడ్డి, తిరుపతిరెడ్డి, హేమంత్‌రెడ్డి, మాణిక్యంరెడ్డి, పలువురు గ్రామస్థులు పాల్గొన్నారు.

శాంతి భద్రతల పరిరక్షణకే ఆకస్మిక తనిఖీలు



వాహనాల తనిఖీ నిర్వహిస్తున్న డీసీపీ కోటిరెడ్డి, పోలీసు సిబ్బంది

మేడ్చల్ టౌన్, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): శాతి భద్రతల పరిరక్షణలో భాగంగా సైబరాబాద్ పోలీస్ స్టేషన్ల పరిధిలో తనిఖీలు నిర్వహిస్తున్నామని మేడ్చల్ డీసీపీ కోటిరెడ్డి అన్నారు. మంగళవారం మేడ్చల్‌లోని కేఎల్ఆర్ వెంచర్‌లో పోలీసులు తనిఖీలు చేపట్టగా డీసీసీ పర్యవేక్షించారు. ఆయన మాట్లాడుతూ.. సైబరాబాద్ కమిషనరేట్‌లో నేరాల నియంత్రణకు సీపీ ఆదేశాల మేరకు సిబ్బంది సాయంత్రం నాలుగు గంటల నుంచి రాత్రి 9గంటల వరకు తనిఖీలు నిర్వహిస్తారని చెప్పారు. పత్రాలు లేకుండా నడిచే వాహనాలను సీజ్ చేస్తారని, అక్రమంగా తరలించే సరుకులు, ట్రాఫిక్ చలానాలు చెల్లించని వాహనాలను స్వాధీనం చేసుకుంటామని తెలిపారు. 86 వాహనాలను తనిఖీ చేసి 30మందిపై కేసులు నమోదు చేశారు. రూ.19వేల చలానాలు వసూలు చేశామన్నారు. ప్రజలు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఏసీపీ శంకర్‌రెడ్డి, సీఐ సత్యనారాయణ, డీఐ కిరణ్, ఎస్ఐలు పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం



జిల్లా స్థాయి కబడ్డీ పోటీలను ప్రారంభిస్తున్న దామోదర్‌రెడ్డి, తదితరులు

కీసర, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): క్రీడలు మానసిక ఉల్లాసాన్నిస్తాయని జిల్లా యువజన, క్రీడల శాఖ అధికారి దామోదర్‌రెడ్డి అన్నారు. మంగళవారం కీసరగుట్ట గురుకుల పాఠశాలలో, క్రీడల సమాఖ్య ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లాస్థాయి కబడ్డీ పోటీలను ప్రారంభించారు. అండర్-14, 17 విభాగాల్లో బాలబాలికలకు నిర్వహించిన పోటీల్లో 400మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఎంపికైన విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని అధికారులు తెలిపారు. కార్యక్రమంలో ఎంఈవో జమదగ్ని, హెచ్ఎం నర్సింహ, జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు రమేష్‌గుప్తా, నాయకుడు భానుశర్మ పాల్గొన్నారు.

బాల్య వివాహాలు లేని గ్రామాలుగా తీర్చిదిద్దుదాం

వికారాబాద్, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): జిల్లాలో బాల్యవివాహాలు లేని గ్రామాలను రూపుదిద్దేందుకు ప్రభుత్వపరంగా తమకు సహాయ సహకారాలు అందించాలని సాధన ఎన్జీవో జిల్లా కోఆర్డినేటర్ రమేశ్.. కలెక్టర్ ప్రతీక్‌జైన్‌ను కోరారు. మంగళవారం ఆయన కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. రమేశ్ మాట్లాడుతూ.. భారత ప్రభుత్వ మహిళా, శిశు అభివృద్ధి శాఖ మంత్రి అన్నపూర్ణదేవి.. బాల్య వివాహాల నిర్మూలన ప్రచార ఉద్యమాన్ని ప్రారంభించారని తెలిపారు. జిల్లాలోని 50గ్రామాల్లో వంద రోజులపాటు బాల్య వివాహ టల ముక్త్ భారత్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. అన్ని పంచాయతీల్లో సమావేశాలు ఏర్పాటు చేస్తామన్నారు. జిల్లాలో బాల్య వివాహాలు నిర్మూలనకు, బాలల హక్కుల కోసం పనిచేసే తమకు ప్రభుత్వపరంగా క్షేత్రస్థాయిలో అధికారులు సహకరించేలా చూడాలని విజ్ఞప్తి చేశారు. అంతకుముందు జిల్లా కోర్టులో డిస్ట్రిక్ట్ లీగల్ సర్వీస్ అథారిటీ కార్యాలయంలో సైతం వినతిని అందజేశారు. బాల్యవివాహాల నిర్మూలన కార్యక్రమాలకు తమ మద్దతు ఉంటుందని డీఎల్ఎస్ఏ ప్రతినిధులు చెప్పారని రమేశ్ తెలిపారు. సాధన సంస్థ ప్రతినిధులు నర్సింహులు, గుమ్మడి రమేశ్ ఉన్నారు.

పార్టీ కోసం కష్టపడిన వారికే పదవులు

పరిగి, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): పార్టీ కోసం కష్టపడిన వారికే పదవులు లభిస్తాయని ఏఐసీసీ పరిశీలకుడు సూరజ్‌సింగ్ ఠాగూర్ అన్నారు. మంగళవారం పరిగిలోని వాసవి బాంక్వెట్ హాల్లో కాంగ్రెస్ సంస్థాగత నిర్మాణ జిల్లా స్థాయి సంఘటన్ సృజన్ అభియాన్ సమావేశం జరిగింది. సూరజ్‌సింగ్‌ఠాగూర్, పీసీసీ నుంచి బెల్లయ్యనాయక్, నీలిమ, వేణుగౌడ్, డీసీసీ అధ్యక్షుడు టి.రామ్మోహన్‌రెడ్డి సమక్షంలో డీసీసీ ఎన్నికపై అభిప్రాయాలకు సేకరించారు. సూరజ్‌సింగ్ మాట్లాడుతూ.. డీసీసీ అధ్యక్షుడిని అందరి అభిప్రాయం మేరకు నియమిస్తామని తెలిపారు. మూడు రోజులు పర్యటించి పార్టీ శ్రేణుల అభిప్రాయాలను సేకరిస్తున్నట్లు చెప్పారు. ఈ నెల 16 వరకు అందుబాటులో ఉంటామన్నారు. అధ్యక్ష పదవికి దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో నాయకులు పరశురాంరెడ్డి, ఆంజనేయులు, ఎం.లాల్‌కృష్ణప్రసాద్, కె.హన్మంతు, ఇ.కృష్ణ, కొమిరె రాంచంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో ముగిసిన లక్ష్మీనరసింహస్వామి ఉత్సవాలు

పరిగి, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): పరిగిలోని లక్ష్మీనరసింహ స్వామి ఉత్సవాలు మంగళవారంతో ముగిశాయి. ఉత్సవాలతో మూడు రోజుల పాటు ఆలయ ప్రాంగణం మర్మోగింది. చివరి రోజున నిత్యహోమం, మహాపూర్ణాహుతి కార్యక్రమాలు నిర్వహించారు. మధ్యాహ్నం లక్ష్మీనరసింహ స్వామి వారి కల్యాణాన్ని ధర్మకర్తలు ఎదిరె పద్మ-కృష్ణ, జయశ్రీ-నరేందర్ దంపతులు జరిపించారు. పరిగి మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి పాల్గొని పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆధ్యాత్మికవేత్తలు మాట్లాడుతూ.. పరిగిలోని లక్ష్మీనరసింహస్వామి శక్తిమంతుడని, ఇక్కడ మొక్కుకుంటే కోరికలు నెరవేరుతాయన్నారు. ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతనను అలవర్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఆయా పార్టీల నాయకులు పాల్గొన్నారు.



లక్ష్మీనరసింహస్వామి కల్యాణాన్ని జరిపిస్తున్న ఆలయ పూజారులు, ధర్మకర్తలు

మైతాబ్‌ఖాన్‌గూడలో షూటింగ్ సందడి

నవాబుపేట, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని మైతాబ్‌ఖాన్‌గూడలో మంగళవారం పల్నాడు అనే సినిమా షూటింగ్‌లో ఓ సన్నివేశాన్ని చిత్రీకరించారు. ఇందులో భాగంగా ఫైట్స్ చిత్రీకరించారు. గ్రామస్థులు ఆసక్తిగా తిలకించారు. డైరెక్టర్ చంద గోవింద రెడ్డివర్మ, హీరోయిన్ రియా సుమన్, విలన్ హరీశ్, నిఖిల్, అక్షర పాల్గొన్నారు.



సినిమా షూటింగ్‌ను తిలకిస్తున్న గ్రామస్థులు

భూములు లాక్కుంటే ఊరుకోం...



ట్రిపుల్‌ఆర్‌కు పోతున్న భూముల్లో పంటలను పరిశీలిస్తున్న రైతులు

వికారాబాద్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : రైతుల భూములను రీజినల్ రింగ్ రోడ్డు (ట్రిపుల్‌ఆర్) నిర్మాణానికి తీసుకుంటే తమకు జీవనాధారం లేకుండా పోతుందని, భూములు లాక్కుంటే ఊరుకునేది లేదని వికారాబాద్ మండలం పులుసుమామిడి రైతులు అన్నారు. మంగళవారం గ్రామంలో ట్రిపుల్‌ఆర్‌కు సేకరించదల్చిన భూముల్లో పర్యటించి రైతులు తమ పొలాల వద్ద పురుగు మందు డబ్బాలతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా రైతు దేవయ్య మాట్లాడుతూ.. తనకున్న రెండు ఎకరాల్లో బావి తవ్వేందుకు రూ.20లక్షల అప్పు చేశానన్నాడు. అప్పు తీరనేలేదు.. తన భూమి ట్రిపుల్‌ఆర్ వెళ్తుందని చెబుతున్నారని ఆవేదన వ్యక్తం చేశాడు. మరో రైతు మల్లారెడ్డి మాట్లాడుతూ..తనకు నాలుగెకరాల పొలం ఉందని, తన ఇద్దరు కొడుకులు డిగ్రీ చదివి వ్యవసాయం చేసుకుంటున్నారని తెలిపాడు. ఈ భూమిపోతే తమ కుటుంబం ఉపాధి కోల్పోతుందని, కొడుకుల పెళ్లి కూడా కష్టపమవుతుందంటూ కన్నీరుపెట్టుకున్నాడు. మరో రైతు మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. తన పొలంలో ఏడాదికి మూడు పంటలు పండుతాయని, ఎక్కువగా పూల సాగుచేస్తానని చెప్పాడు. ఏటా పది లక్షల రూపాయల పంట పండిస్తానని, తమ కుటుంబానికి చెందిన వంద ఎకరాల భూమి ట్రిపుల్‌ఆర్ ప్రాజెక్ట్‌లో పోతుందన్నారు. అందులో వందల బోర్లు ఉన్నాయని చెప్పారు. ప్రభుత్వం తమ గోడు విని పాత అలైన్మెంట్ ప్రకారమే రోడ్డు నిర్మించాలన్నారు. లేకుంటే ఈ కుటుంబాలన్నీ పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకునే పరిస్థితి వస్తుందని హెచ్చరించారు.

ఆమనగల్లు అభివృద్ధికి అందరం కృషి చేద్దాం



తల్లోజు ఆచారిని సన్మానిస్తున్న దసరా ఉత్సవ కమిటీ సభ్యులు

ఆమనగల్లు, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): ఆమనగల్లు అభివృద్ధికి రాజకీయాలకతీతంగా కలిసికట్టుగా కృషిచేద్దామని జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు, బీజేపీ రాష్ట్ర నాయకుడు తల్లోజు ఆచారి పిలుపునిచ్చారు. త్వరలో సీఎం రేవంత్‌రెడ్డి, ఎంపీ మల్లు రవి, ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డిలను కలిసి ముందుకు సాగుదామన్నారు. ఆమనగల్లులోని భవానీగార్డెన్‌లో దసరా ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం అలయ్ బలయ్ నిర్వహించారు. ఆచారి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. దసరా ఉత్సవ కమిటీ సభ్యులు, అన్ని పార్టీల నాయకులు, కార్యకర్తలు, ప్రజా సంఘాల నేతలు, పట్టణ ప్రముఖులు, ప్రజలు పాల్గొన్నారు. దసరా సంబరాలను విజయవంతం చేసిన, వేడుకలకు సహకరించిన దాతలు, నాయకులను సత్కరించి జ్ఞాపికలు బహూకరించారు. వేడుకలపై ప్రచారం నిర్వహించిన విలేకరులను ఆచారి, ఉత్సవ కమిటీ సభ్యులు సత్కరించారు. ఆచారి మాట్లాడుతూ.. ఆమనగల్లులో ఇకపై ప్రతి ఏటా జరిగే దసరా, బోనాలు సంబురాలు, పండుగలను మున్సిపాలిటీ పాలకవర్గంతో పాటు ఉత్సవ కమిటీలు కలిసి నిర్వహించాలన్నారు. పట్టణ జనాభా పెరుగుతున్న నేపథ్యంలో వసతుల కల్పన, అభివృద్ధి పనులు చేపట్టాల్సిన అవసరముందని ఆచారి అన్నారు. అభివృద్ధికి తాను ఎక్కడికైనా వస్తానని స్పష్టం చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శంకర్‌నాయక్, మాజీ జడ్పీటీసీ కండె హరిప్రసాద్, మున్సిపల్ మాజీ వైస్‌చైర్మన్ దుర్గయ్య, నాయకులు, ప్రముఖులు పాపిశెట్టి రాము, పత్యానాయక్, విక్రమ్‌రెడ్డి, మానయ్య, శ్రీనివాస్‌రెడ్డి, గిరియాదవ్, గుర్రం కేశవులు, గోరటి నర్సింహ, లక్ష్మణ్, శ్రీను, సాయిలు, భాస్కర్, చెన్నకేశవులు, మహేశ్, రవిరాథోడ్, నిరంజన్ గౌడ్, శ్రీకాంత్‌సింగ్, టిల్లు, గుజ్జరి ప్రవీణ్, సీతపెద్దయ్య, రమేశ్ పాల్గొన్నారు.



అలయ్ బలయ్ దాతలు, ఉత్సవ కమిటీ సభ్యులకు సన్మానం

వైభవంగా రేణుకా ఎల్లమ్మ కల్యాణం





ఎల్లమ్మ కల్యాణాన్ని నిర్వహిస్తున్న భక్తులు, పండితులు

శామీర్‌పేట, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): శామీర్‌పేటలో మంగళవారం గౌడ సంఘం ఆధ్వర్యంలో సోమవారం శ్రీ రేణుకా ఎల్లమ్మ ఆలయ 8వ వార్షికోత్సవాన్ని, అమ్మ వారి కల్యాణాన్ని నిర్వహించారు. వార్షికోత్సవంలో భాగంగా మంగళవారం యాస్కి కుటుంబ సభ్యులు, గౌడ సంఘం నాయకులు వేద బ్రాహ్మణుల మంత్రోశ్చరణల మధ్య వేడుకలను నిర్వహించారు. ఆలయానికి ఆర్టీఏ సభ్యుడు భీమిడి జైపాల్‌రెడ్డి, కట్టమైసమ్మ ఆలయ కమిటీ చైర్మన్ మహేందర్‌యాదవ్, సభ్యులు, శామీర్‌పేట మాజీ సర్పంచ్ కిశోర్‌యాదవ్, మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు, భక్తులొచ్చి ఎల్లమ్మను దర్శించుకున్నారు.

భక్తులకు అన్నదానం

ఎల్లమ్మ ఆలయంలో యాస్కి కుటుంబ సభ్యులు భక్తులకు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా ఎల్లమ్మ ఆలయానికి వేలాది మంది భక్తులు వచ్చి అన్నప్రసాదాన్ని స్వీకరించారు.

ఫిర్యాదులపై సత్వరం స్పందించాలి : ఏసీపీ



సిబ్బందికి సూచనలిస్తున్న ఏసీపీ లక్ష్మీనారాయణ

తలకొండపల్లి, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): ఫిర్యాదులపై సత్వరం స్పందించాలని షాద్‌నగర్ ఏసీపీ లక్ష్మీనారాయణ ఆదేశించారు. పోలీసు స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదు దారులపట్ల అధికారులు, సిబ్బంది మర్యాదగా మసలుకోవాలని సూచించారు. తలకొండపల్లి పోలీసుస్టేషన్‌ను మంగళవారం ఏసీపీ తనిఖీ చేశారు. రికార్డులను, పరిసరాలను పరిశీలించారు. స్టేషన్ సిబ్బంది నిర్వహిస్తున్న విధుల గురించి అడిగి తెలుసుకున్నారు. ఆమనగల్లు సీఐ జానకిరాంరెడ్డి, ఎస్ఐ శ్రీకాంత్‌లతో సమావేశమై పెండింగ్ కేసులు, రోడ్డు ప్రమాదాల నివారణకు తీసుకుంటున్న చర్యలు, సీసీ కెమెరాల ఏర్పాటు గురించి అడిగి తెలుసుకున్నారు. స్టేషన్ పరిధిలో ఉన్న రౌడీషీట్స్, హిస్టరీ షీట్స్, సస్పెక్ట్ షీట్స్ లిస్టులను తనిఖీ చేసి వారిపై ప్రత్యేక నిఘా ఉంచాలన్నారు. నేర దర్యాప్తులో సాంకేతిక పరిజ్ఞానాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సిబ్బంది క్రమశిక్షణ, సమయ పాలనతో మెలగాలన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో గ్రామాల్లో అల్లర్లు జరగకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎస్ఐ శేఖర్, సిబ్బంది ఉన్నారు.

విద్యుత్ శాఖలో సాసా ఎంప్లాయీస్ యాప్



తాండూరు, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): విద్యుత్ శాఖలో సాసా ఎంప్లాయీస్ యాప్‌ను పకడ్బందీగా అమలు చేస్తున్నారు. లైన్‌మన్ నుంచి సీఎండీ వరకు ఈ యాప్‌లో అప్‌డేట్‌గా ఉంటున్నారు. బిల్లింగ్, రోజు వారీ విద్యుత్ బిల్లుల వసూళ్లు, బకాయి పడ్డ విద్యుత్ సర్వీస్ కనెక్షన్లు తొలగించారా లేదా, బకాయి చెల్లించిన తర్వాత రీ-కనెక్షన్ ఇచ్చారా? లేదా అనే విషయం ఎప్పటికప్పుడు ఈ యాప్‌లో పొందుపర్చాలని ఆదేశాలు రావడంతో ఉద్యోగులు అప్రమత్తమయ్యారు. కనెక్షన్‌కు వెళ్తున్న లోకేషన్‌ను కూడ ఇందులో పొందుపర్చాల్సి ఉంటుంది. రోజువారిగా విద్యుత్ సిబ్బంది పని తీరును ఈ యాప్ ద్వారా సీఎండీ కార్యాలయం వరకు పరిశీలిస్తుంది. ఫీడర్లు ట్రిప్ జరిగినా వాటిని కూడా ఈ యాప్‌లో పొందుపర్చాల్సి ఉంటుంది. ఈ యాప్ అమలులోకి రావడంతో లైన్‌మెన్ నుంచి సబ్ ఇంజనీర్లు, ఇంజనీర్లు, ఏడీ, డీఈ, ఎస్ఈలు ఎప్పటికప్పుడు సీఎండీ కార్యాలయానికి అందుబాటులో ఉంటున్నారు.

ఇసుక అక్రమ రవాణాపై కఠిన చర్యలు



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రతీక్ జైన్

వికారాబాద్, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఇసుక అక్రమ రవాణా నివారణకు పకడ్బందీ చర్యలు చేపట్టాలని కలెక్టర్ ప్రతీక్ జైన్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో ఇసుక రవాణాపై అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. ఇసుక అక్రమ రవాణా జరుగకుండా రెవెన్యూ, ఇరిగేషన్, గ్రౌండ్‌వాటర్, మైన్స్ శాఖలు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇసుక రవాణాపై నిత్యం విస్తృత తనిఖీలు నిర్వహించి, జిల్లా సరిహద్దుల వద్ద నిఘా ఏర్పాటు చేయాలని ఆదేశించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ లింగ్యానాయక్, డీపీవో జయసుధ, మైన్స్ ఏడీ సత్యనారాయణ, గ్రౌండ్‌వాటర్ ఏడీ రవి, ఏవో పర్వీన్ బేగం, డి-సెక్షన్ సూపరింటెండెంట్ మునీర్, ఈడీఎం మహమూద్, తహసీల్దార్లు పాల్గొన్నారు.

బాగా చదివి భవిష్యత్తును తీర్చిదిద్దుకోండి

విద్యార్థులు బాగా చదువుకొని భవిష్యత్తును తీర్చిదిద్దుకోవాలని కలెక్టర్ ప్రతీక్ జైన్ సూచించారు. కరోనా సమయంలో తల్లిదండ్రులను కోల్పోయిన పిల్లల యోగక్షేమాలను మంగళవారం జూమ్ మీటింగ్ ద్వారా ఆరా తీశారు. శిశుసంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జూమ్ మీటింగ్‌లో కలెక్టర్ తన చాంబర్ నుంచి పాల్గొన్నారు. పిల్లలతో మాట్లాడి వారి ఆరోగ్యం, విద్య, వ్యక్తిగత పరిస్థితులు, శిశు సంక్షేమ శాఖ ద్వారా అందిన సాయం వంటి వాటిపై వివరాలు తెలుసుకున్నారు. కార్యక్రమంలో సంక్షేమ అధికారి కృష్ణవేణి, బీఆర్‌బీ కో-ఆర్డినేటర్ కాంతారావు, డీసీపీవో శ్రీకాంత్, పీవో ఆంజనేయులు, పాల్గొన్నారు.

రైతులు మద్దతు ధరలపై తెలుసుకోవాలి

రైతులు ప్రభుత్వంచే ఇచ్చే మద్దతు ధరలు తెలుసుకోవాలని కలెక్టర్ ప్రతీక్‌జైన్ అన్నారు. కలెక్టర్ కార్యాలయంలో మద్దతు ధర తెలిపే పోస్టర్లను విడుదల చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ.. తమ పంటలను సరైన మార్కెట్లలో విక్రయించాలని సూచించారు. అవగాహన కోసం అధికారులు విస్తృతంగా ప్రచారం చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా మార్కెటింగ్ అధికారి సారంగపాణి, వ్యవసాయ మార్కెట్ కమిటీ తాండూరు కార్యదర్శి శ్రీనివాస్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

సీజేఐపై దాడి చేసిన న్యాయవాదిని శిక్షించాలి

ఇబ్రహీంపట్నం, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): సుప్రీం కోర్టు సీజే గవాయ్‌పై షూతో దాడిచేసిన న్యాయవాదిని కఠినంగా శిక్షించాలని వక్తలు డిమాండ్ చేశారు. మంగళవారం కేవీపీఎస్ ఆధ్వర్యంలో పాషా నరహరి స్మారక కేంద్రంలో ప్రజాసంఘాల రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు సామేల్ అధ్యక్షత వహించారు. కేవీపీఎస్ నాయకుడు ప్రకాశ్‌కరత్, బీఎస్పీ కొండ్రు రఘుపతి, తెలంగాణ ఉద్యమకారుడు వీరేష్‌కుమార్, మాల మహానాడు మారయ్య, పూసల సంఘం పురుషోత్తం, రజక సంఘం అజయ్, వెంకటేష్ పాల్గొన్నారు. గవాయ్‌పై దాడి రాజ్యాంగంపై జరిగిన దాడిగా అభివర్ణించారు.



రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న సామేల్

పర్యావరణ పరిరక్షణ ప్రతీ ఒక్కరి బాధ్యత

శామీర్‌పేట, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరు పర్యావరణాన్ని బాధ్యతగా పరిరక్షించాలని ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ అనిత పిలుపునిచ్చారు. అలియాబాద్ పరిధి మజీద్‌పూర్‌లో శామీర్‌పేట గురుకుల డిగ్రీ మహిళ ఎన్ఎస్ఎస్ వలంటీర్లు క్యాంప్ చేపట్టారు. ఆరో రోజు మంగళవారం వారు పర్యావరణ పరిరక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. వలంటీర్లు గ్రామంలోని కాలనీల్లో మొక్కలు నాటారు. వృక్ష సంరక్షణ ప్రాముఖ్యత, ప్లాస్టిక్ వినియోగంతో కలిగే అనర్థాలను వివరించారు. కళాశాల ఎన్ఎస్ఎస్ సభ్యురాలు ధనవేణి, పీడీ హైమవతి పాల్గొన్నారు.

మహిళ కళ్లలో కారంచల్లి..

- బంగారు పుస్తెలతాడు లాక్కున్న దుండగుడు



చికిత్స పొందుతున్న సునీత

శంకర్‌పల్లి, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): పట్టపగలు ఇంట్లోకి ప్రవేశించి మహిళ కళ్లలో కారం చల్లి బ్యాట్‌తో కొట్టి పుస్తెలతాడు లాక్కెళుతున్న దుండగుడిని స్థానికులు పట్టుకున్నారు. పుస్తెలతాడును స్వాధీనం చేసుకుని పోలీసులకు అప్పగించారు. ఈ ఘటనకు సంబంధించి శంకర్‌పల్లి సీఐ శ్రీనివాస్‌గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. కామారెడ్డి జిల్లా జుక్కల్ మండలం సావర్గావ్‌కు చెందిన కుంబారి సిద్ధారెడ్డి కుటుంబంతో నాలుగేళ్ల నుంచి శంకర్‌పల్లిలోని భవానీనగర్‌లో ఉంటూ సంగారెడ్డి రోడ్డులో మధుర ఫుడ్‌కోర్టు నడుపుతున్నాడు. మంగళవారం మధ్యాహ్నం సిద్ధారెడ్డి భార్య సునీత ఇంట్లో ఉన్న సమయంలో ఓ దుండగుడు ఇంట్లోకి ప్రవేశించి ఆమె కళ్లలో కారంచల్లి బ్యాటుతో తలపై కొట్టి మెడలోని మూడున్నర తులాల బంగారు పుస్తెలతాడును లాక్కొని పారిపోబోయాడు. సునీత అరవడంతో చుట్టుపక్కల వారు పట్టుకుని దొంగకు దేహశుద్ధి చేసి పోలీస్‌స్టేషన్‌లో అప్పగించారు. గాయపడిన సునీతను ఆస్పత్రికి తరలించారు. దుండగుడిని సిద్ధారెడ్డి నడుపుతున్న హోటల్‌కు ఎదురుగా ఉండే వ్యక్తిగా గుర్తించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

సేవాతత్పరుడు.. బోడంపాటి

- పాఠశాలల అభివృద్ధికి కృషి
- సామాజిక కార్యక్రమాలతో ప్రజల మన్ననలు పొందుతున్న రవీందర్‌రెడ్డి



రవీందర్‌రెడ్డి బాగు చేయించిన మహదేవ్‌పూర్ పాఠశాల భవనం

కొందుర్గు, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): తాను చదువుకున్న పాఠశాలకు ఏదో చెయ్యాలనే సంకల్పంతో పాఠశాలల అభివృద్ధికి పాటుపడుతున్నారు మహదేవ్‌పూర్‌నకు చెందిన బోడంపాటి రవీందర్‌రెడ్డి. చదువుతోనే ఏదైనా సాధించొచ్చని నమ్మిన ఆయన డబ్బు వెచ్చించి గ్రామ పాఠశాల అభివృద్ధికి కృషిచేస్తున్నారు. సేవే పరమావధిగా గ్రామంలో ఎవరికి ఏ ఆపదొచ్చినా అండగా నిలబడే వ్యక్తి మహదేవ్‌పూర్ వాసి రవీందర్‌రెడ్డి. యేటా తన తండ్రి మధుసూదన్‌రెడ్డి జ్ఞాపకార్థం చలివేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నారు. గ్రామంలో కష్టాల్లో కుటుంబానికి రూ.10 వేల సాయం అందజేస్తారు. మండలంలోని రాంచంద్రపూర్ ప్రాథమికోన్నత, మహదేవ్‌పూర్ ప్రాథమిక పాఠశాలలు శిథిలావస్థకు చేరడంతో ఆ పాఠశాలలకు మరమ్మతులు చేయించారు. రూ.2.3లక్షలు వెచ్చించి పాఠశాలల భవనాలకు మెరుగులు దిద్దారు. నేటి బాలలే రేపటి పౌరులు అని.. చదువుతోనే ఉజ్వల భవిష్యత్తు అని పిల్లల చదువు కోసం కృషిచేస్తున్నారు.

పాఠశాలల అభివృద్ధికి కృషి చేస్తా



ఊరిలో బడిగుడి బాగుంటేనే మంచి విద్య అందుతుంది. ప్రజాసేవకు మించింది లేదు. పాఠశాల విద్యార్థుల అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్నా.

\- బోడంపాటి రవీందర్‌రెడ్డి

దాతల సహకారం గొప్పది



పాఠశాల అభివృద్ధి చేయడం అభినందనీయం. పాఠశాల స్థితిగతులు చెప్పిన వెంటనే స్పందించిన దాత రవీందర్‌రెడ్డికి ధన్యవాదాలు.

\- లిఖిత, టీచర్, మహదేవ్‌పూర్

రోడ్డంతా బురదమయం!

● వాహనదారులకు తప్పని తిప్పలు


బషీరాబాద్ గ్రామ పంచాయతీ ప్రధాన రోడ్డు

బషీరాబాద్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ ఎదుట ప్రధాన రోడ్డు బురదమయంగా మారింది. బషీరాబాద్ నుంచి జీవన్గి మీదుగా కరణ్‌కోట్ వరకు గల మార్గాన్ని అభివృద్ధి పర్చేందుకు రూ.30కోట్లు మంజూరైన విషయం తెలిసిందే. ఈ క్రమంలో కాంట్రాక్టర్ నెల కిందట రోడ్డు పనులు మొదలుపెట్టారు. బషీరాబాద్ గ్రామ పంచాయతీ వద్ద ప్రధాన మార్గాన్ని సీసీ నిర్మాణం చేపట్టేందుకు ఎక్స్‌కావేటర్‌తో తవ్వారు. ఇటీవల కొంత మొరం వేసిన గుంతలు పడి బురదమయం కావడంతో వాహనదారులు ముందుకు వెళ్లలేక నానా అవస్థలు పడుతున్నారు.

పశువైద్యం.. దైవాధీనం!

● అందుబాటులో లేని మందులు
● వేధిస్తున్న సిబ్బంది కొరత
● మృత్యువాతపడుతున్న మూగజీవాలు

బషీరాబాద్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): గతంతో పోలిస్తే పల్లెల్లో పశుసంపద చాలా వరకు తగ్గిపోయింది. కొంత మంది రైతులు వ్యవసాయంతో పాటు పశువులను పెంచుతున్నారు. అయితే ఆపద సమయంలో పశువులకు వైద్యం అందడం లేదు. అవసరమైన డాక్టర్లు, సిబ్బంది లేకపోవడంతో కావాల్సిన మందులు దొరుకక నానా అవస్థలు పడుతున్నారు. మండలంలో 39 గ్రామ పంచాయతీలు ఉండగా, బషీరాబాద్, గొట్టిగఖుర్దు గ్రామాల్లో పశు వైద్యశాలలు, రెడ్డిఘణాపూర్, మైల్వార్‌లో ఉపకేంద్రాలు ఉన్నాయి. ఆయా కేంద్రాల్లో సరైన మందులు అందుబాటులో ఉండటంలేదు. దీంతో గేదెలు, ఆవులు, గొర్రెలు, మేకలకు సరైన వైద్యం అందక మృత్యువాతపడుతున్నాయి. మండల వ్యాప్తంగా ఎడ్లు, ఆవులు 8,340, గేదెలు 2,456, మేకలు 12,895, గొర్రెలు 11,602, కోళ్లు 15,757 ఉన్నట్లు అధికారుల లెక్కలు చెబుతున్నాయి. పశువులకు కనీస వైద్యం అందని దుస్థితి నెలకొనడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

వేధిస్తున్న డాక్టర్లు, సిబ్బంది కొరత

బషీరాబాద్, గొట్టిగఖుర్దు పశువైద్యశాలతో పాటు రెడ్డిఘణాపూర్ ఉపకేంద్రంలో డాక్టర్లు, సిబ్బంది కొరత తీవ్రంగా వేధిస్తోంది. కులకచర్ల మండలం ముజాయిత్‌పూర్‌లో పశువైద్యుడిగా విధులు నిర్వర్తిస్తున్న డాక్టర్.హతిరాంకు ఇక్కడి బషీరాబాద్ ఆస్పత్రిలో ఇన్‌చార్జి బాధ్యతలు ఇచ్చారు. సదరు వైద్యుడు దౌల్తాబాద్ మండలానికి కూడా ఇన్‌చార్జిగా ఉండటంతో ఎక్కడా న్యాయం చేయలేకపోతున్నాడు. దీంతో మండలంలోని ఆయా ఆస్పత్రుల్లో పశువైద్యాధికారి పోస్టులు, అటెండర్ పోస్టులన్నీ ఖాళీగా ఉన్నాయి. మైల్వార్ పశువైద్య కేంద్రంలో జూనియర్ వెటర్నరీ డాక్టర్ మాత్రం ఉన్నప్పటికీ అన్నీ తానే చూస్తున్నాడు. రెడ్డిఘణాపూర్ ఉప వైద్య కేంద్రంలో పశువు వైద్యం పూర్తిగా అందడంలేదు. ఇక్కడా వెటర్నరీ లైవ్ స్టాక్ (వీఎల్‌వో)గా పని చేస్తున్న విలాసిని ఇటీవల మెడికల్ లీవ్‌పై వెళ్లడంతో ఆస్పత్రి మూత పడిందని స్థానిక రైతులు వాపోతున్నారు. ఆయా పశువైద్యాశాలల్లో డాక్టర్ల పోస్టులు అటుంచితే, కనీసం అటెండర్లు లేకపోవడంతో పశువైద్యశాలలను తెరిచే పరిస్థితి లేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి పశువైద్యులు, సిబ్బందిని నియమించాలని మండలు రైతులు కోరుతున్నారు.

మూగజీవాలు చనిపోతున్నాయి



మండల వ్యాప్తంగా నాలుగు పశు వైద్యశాలలు ఉన్న రైతులకు ఉపయోగపడటంలేదు. డాక్టర్లు లేరు. మూగజీవాలకు అనారోగ్యానికి గురైతే మైల్వార్ ఉప కేంద్రంలోని ఒక జూనియర్ డాక్టర్‌కు ఫోన్‌చేయాల్సి వస్తోంది. ఇటీవల ఒక లేగదూడకు ల్యాంపి వ్యాధి సోకి దినదిన గండంగా అవస్థలు పడి మృత్యువాతపడింది.

- రాజేందర్‌రెడ్డి, రైతు నావాంద్గీ బషీరాబాద్ మండలం


గొట్టిగఖుర్దు పశువైద్యశాల

కేజీబీవీ పాఠశాలల్లో ఖాళీ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

బంట్వారం, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయంలో స్వీపర్, అసిస్టెంట్ కుక్ పోస్టులకు అర్హులైన మహిళలు దరఖాస్తు చేసుకోవాలని మండల విద్యా అధికారి పి.వెంకటేశ్వరరావు మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అర్హత ఉన్న అభ్యర్థులు మహిళలు మాత్రమే ఉండాలన్నారు. వయస్సు 18నుంచి 45సంవత్సరాల మధ్య ఉండాలని సూచించారు. మండలానికి చెందిన స్థానిక మహిళా అభ్యర్థులు మాత్రమే అర్హులన్నారు. విద్యార్హత కనీసం 7వ తరగతి ఉత్తీర్ణతగా ఉండాలన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు దరఖాస్తుల స్వీకరణ బంట్వారం మండల విద్యాధికారి కార్యాలయంలో సమర్పించాల్సి ఉంటుందని తెలిపారు. దరఖాస్తుల చివరి తేదీ ఈ నెల 29వరకు చేసుకోవచ్చని తెలిపారు.

మోమిన్‌పేట్: మండలంలోని చంద్రయన్‌పల్లి గ్రామంలోని కేజీబీవీ పాఠశాలలో ఖాళీగా ఉన్న స్వీపర్ పోస్టుకు ఆసక్తి గల వారు దరఖాస్తు చేసుకోవాలని ఎంఈవో మల్లేశం మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. 18 నుంచి 45 సంవత్సరాల్లోపు వయసు కలిగి ఉన్న మహిళలు 7వ తరగతి చదివి ఉండాలని తెలిపారు. మరిన్ని వివరాలకు ఎంఈవో కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

దివ్యాంగుడిపై దాడికి పాల్పడిన వ్యక్తిని అరెస్ట్ చేయాలి


మాట్లాడుతున్న కాళ్ల జంగయ్య, తదితరులు

బషీరాబాద్, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): దివ్యాంగుడు, అతడి కుటుంబంపై దాడికి పాల్పడిన వ్యక్తిని వెంటనే అరెస్ట్ చేయాలని వీహెచ్‌పీఎస్(దివ్యాంగుల హక్కుల పోరాట సమితి) రాష్ట్ర అధ్యక్షుడు కాళ్ల జంగయ్య అన్నారు. బాధితుడు చెరుకు రాజ్‌గౌడ్ మంగళవారం కుటుంబసభ్యులతో కలిసి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ సందర్భంగా కాళ్ల జంగయ్య మట్లాడుతూ.. దివ్యాంగుడైన రాజుగౌడ్, అతడి భార్య అర్చనపై అకారణంగా బోయ వెంకటయ్య దాడికి పాల్పడ్డాడని ఆరోపించారు. 14 రోజులు గడుస్తున్నా రాజుగౌడ్ ఫిర్యాదును పోలీసులు పక్కకు పెట్టారన్నారు. బోయ వెంకటయ్యను వెంటనే అరెస్ట్ చేయకుంటే ఎస్పీని కలిసి ఫిర్యాదు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో నల్లరాజు, విజయ్‌కుమార్, నాగార్జున శ్రీనివాస్‌చారి, నర్సింహ, నర్సింహులు, నాయకులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా 'ఆనంద్ సబ్ కేలియో'


టపాసులు కాలుస్తున్న మంచ్ ప్రతినిధులు

తాండూరు రూరల్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): మార్వాడీ యువ మంచ్ ఆధ్వర్యంలో తాండూరు మండలం కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో మంగళవారం ఆనంద్ సబ్ కేలియో కార్యక్రమాన్ని ఉత్సాహంగా నిర్వహించారు. 375మంది విద్యార్థినులతో ఈ కార్యక్రమం జరిగింది. అల్పాహారం, కేక్, కర్రిపప్పు, చిప్స్‌లతో పాటు స్వీట్లు పంపిణీ చేశారు. విద్యార్థినులకు గిఫ్ట్ ప్యాకెట్లను ఇవ్వడంతో పాటు టపాసులతో ఆనంద్ సబ్ కేలియో కార్యక్రమం నిర్వహించారు. ముందస్తు దీపావళి సంబరాలను జరుపుకున్నారు. విద్యాలయ ప్రిన్సిపాల్ ఆశలత, ఉపాధ్యాయురాలు శిరీషతో పాటు మంచ్ అధ్యక్షుడు అనిల్ సార్డా, కార్యదర్శి సచిన్ రాఠి, కోశాధికారి అరుణ్ సార్డా, మంచ్ ప్రతినిధులు బ్రిజ్ మోహన్ బుబ్, మన్మోహన్ సార్డా, తదితరులు ఉన్నారు.

ఇసుక అనుమతులు ఇవ్వొద్దు

బషీరాబాద్, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): నవాంద్గీ వద్ద కాగ్నా నదిలో ఇసుక తరలింపునకు అనుమతులు ఇవ్వొద్దని నవాంద్గీ గ్రామ ప్రజలు మంగళవారం బషీరాబాద్ తహసీల్దార్ షాహిదాబేగంను కలిసి విన్నవించారు. ఇక్కడి సమీపంలో ఎత్తిపోతల పథకం పంప్ హౌజ్ ఉందని, ఇసుక తరలింపుకు అనుమతులిస్తే నీటి నిల్వ సామర్థ్యం తగ్గి పోతుందన్నారు.

కుదిరిన ముహూర్తం

(ఐదో పేజీ తరువాయి)

వదలడం వల్ల వాటి ఎదుగుదలపై ప్రభావం పడే అవకాశం ఉంది. రెండు నుంచి మూడు నెలలు ఆలస్యంగా చెరువుల్లోకి వదలడం వల్ల ఈసారి ఆశించిన స్థాయిలో దిగుబడి రాకపోవచ్చనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. 35-40 సెం.మీ. పొడవు చేప పిల్లలు సుమారు కిలో బరువు వచ్చేసరికి ఎనిమిది నెలల సమయం పట్టే అవకాశం ఉంది.

భారీ వర్షాలకు కొట్టుకుపోయేవి...

జిల్లాలో కురిసిన వరుస వర్షాలకు చాలా వరకు చెరువులు అలుగెత్తి ప్రవహించాయి. చెరువుల్లోకి చేప పిల్లలను వదిలిన తర్వాత భారీ వర్షాలు కురిసి ఉంటే ఆ వరద ఉధృతికి చెరువుల్లోకి వదిలిన చేప పిల్లలు కొట్టుకుపోయి మత్స్యకారులకు తీరని నష్టం వాటిల్లేదని వాపోతున్నారు. చేప పిల్లలు వదిలిన తర్వాత భారీ వర్షాలు కురియకపోతేనే మంచిదని పేర్కొంటున్నారు. చేప పిల్లల పంపిణీ ఆలస్యమైతే ఎదుగుదలపై ఆ ప్రభావం ఉంటుందని, ఉత్పత్తులు ఆలస్యంగా రావడం తప్ప ఇతర నష్టాలు ఉండవని అంటున్నారు. చేప పిల్లల పంపిణీ ఆలస్యం కావడం వల్ల చెరువుల్లో నుంచి వరద ఉధృతిలో చేప పిల్లలు కొట్టుకుపోయే పరిస్థితి ఎదురు కాలేదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

గతేడాది 3,707 మెట్రిక్ టన్నుల ఉత్పత్తి

గతేడాది జిల్లాలోని 22 చెరువుల్లో బొచ్చె, రవట, బంగారు తీగ, మోసు రకాలకు చెందిన 13.37 లక్షల చేప పిల్లలను వదిలారు. బొచ్చ రకం 5,18,671 పిల్లలు, రవట 6,70,154, బంగారు తీగ 18,747, మోసు 1,29,674 పిల్లలను వదిలారు. గత ఏడాది జిల్లాలో ఆయా రకాల చేప పిల్లల నుంచి మొత్తం 3,707 మెట్రిక్ టన్నుల దిగుబడి వచ్చింది.

ఆదేశాలు రాగానే పంపిణీ



ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు రాగానే జిల్లాలో ఉచిత చేప పిల్లల పంపిణీ ప్రారంభిస్తాం. కురిసిన వర్షాలకు జిల్లాల్లో అన్ని చెరువుల్లో నిండుగా నీరు చేరింది. చెరువుల్లో చేప పిల్లలు వదిలేందుకు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నాం.

- ఎం.వెంకయ్య, జిల్లా మత్స్యశాఖ అధికారి

ఉచిత విత్తనాలు దళారుల పాలు

(ఐదో పేజీ తరువాయి)

గుట్టుచప్పుడు కాకుండా పంపిణీ ప్రారంభించారు. ముందుగా తెలుసుకున్న కొంత మంది దళారులు మెట్లకుంట రైతుల పాస్ పుస్తకాలతో ఒక్కొక్క దళారి 20 నుంచి 50 బస్తాల వరకు రెండో శనివారం మాత్రమే 1,900 బస్తాల ఉచిత వేరుశనగ విత్తనాలను తీసుకెళ్లారు. వారు తీసుకెళ్లిన ఉచిత వేరుశనగ విత్తనాలను బ్లాక్ మార్కెట్‌లో క్వింటాల్‌కు రూ.4,800 నుంచి రూ.5వేల వరకు విక్రయించినట్లు సమాచారం. మండలంలో ఓ పేరు మోసిన వేరుశనగ వ్యాపారి వద్ద శని, ఆదివారం రోజుల్లో 200 బస్తాల ఉచిత వేరుశనగ విత్తనాలు విక్రయానికి వచ్చినట్లు సమాచారం. రైతులకు ఉచితంగా వేరుశనగ విత్తనాలు అందించి నూనె గింజల అభివృద్ధి చేయాల్సిన ఈ పథకం దళారుల చెంతకు చేరడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పక్కదారి పట్టిన వేరుశనగ విత్తనాలను రికవరీ చేయాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. ఈ విషయంపై మండల వ్యవసాయ శాఖ అధికారి పోలప్పను వివరణ కోరగా ఉన్నతస్థాయి అధికారుల ఆదేశానుసారమే రైతు పాస్ పుస్తకాల జిరాక్స్‌లతో ఉచిత విత్తనాలను పంపిణీ చేశామని తెలిపారు. రైతులు తీసుకెళ్లి ఏం చేశారో తమకు తెలియదన్నారు.

రైతులకు న్యాయం చేయాలి



శనివారం ఒక్కరోజే మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల సమయంలో ఉచిత వేరుశనగ విత్తనాలు పక్కదారి పట్టాయి. మండలంలోని ఓ వ్యాపారి మండల కేంద్రం నుంచి 200 బస్తాలు విక్రయానికి వచ్చినట్లు తెలపడం గమనార్హం. దీనిపై వ్యవసాయ శాఖ ఉన్నతాధికారులు విచారణ చేపట్టి రైతులకు న్యాయం చేయాలి.

- కటికె శేఖర్, యూత్ కాంగ్రెస్ నాయకుడు

రూ.6వేలు ఇస్తేనే ఇంటి నిర్మాణానికి అనుమతి!

దోమ, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): రూ.6వేలు ఇస్తేనే ఇంటి నిర్మాణానికి అనుమతిస్తామంటున్నారని రాకొండ గ్రామానికి చెందిన పిల్లి శ్యామలమ్మ ఆవేదన వ్యక్తం చేసింది. ఆమె మంగళవారం మాట్లాడుతూ ఇంటి నిర్మాణానికి తాను జూలైలో దరఖాస్తు చేసుకున్నా నేటి వరకు అనుమతి ఇవ్వడం లేదని వాపోయింది. ప్రభుత్వం నిర్ణయించిన రుసుం రూ.2వేలు ఉండగా పంచాయతీ కార్యదర్శి రూ.6వేలు ఇస్తేనే ఇంటి నిర్మాణం అనుమతి ఇస్తామంటున్నారని బాధితురాలు ఆరోపించింది. మండల అధికారులకు ఫిర్యాదుచేసినా పట్టించుకోవడం లేదని తెలిపింది.

బిల్లు వస్తే వసూళ్లు

యాలాల, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇంటి బిల్లు వస్తే డబ్బులు వసూలు చేస్తున్నారని ముకుందాపూర్ గ్రామానికి చెందిన లబ్ధిదారు వడ్ల బాలమ్మ మంగళవారం మీడియాతో తెలిపింది. తనకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు కాగా బేస్మెంట్ బిల్లు రూ.లక్ష రాగానే గ్రామపంచాయతీ కార్యదర్శి గోపాల్ తన వద్ద రూ.వెయ్యి తీసుకున్నాడని చెప్పింది. మాజీ ఉపసర్పంచ్ రాజు మాట్లాడుతూ.. గ్రామంలో పారిశుధ్యం అస్తవ్యస్తంగా మారిందని తెలిపారు. ఫిర్యాదు చేసేందుకు పంచాయతీ కార్యాలయానికి వెళ్తే పంచాయతీ కార్యదర్శి అందుబాటులో ఉండటం లేదని తెలిపారు. గ్రామానికి ఎప్పుడు వస్తారో, ఎప్పుడు వెళతారో అర్థం కావడం లేదని అన్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు వెంటనే పంచాయతీ కార్యదర్శిపై చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

బంద్‌ను జయప్రదం చేయాలి

కొడంగల్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): కొడంగల్‌కు మంజూరైన మెడికల్, వెటర్నరీ కళాశాలలు, పాత కొడంగల్‌లో గురుకులాలను ఇతర ప్రాంతాలకు తరలింపుకు నిరసనగా కొడంగల్ అభివృద్ధి పరిరక్షణ ఐక్యకార్యాచరణ కమిటీ ఆధ్వర్యంలో గురువారం కొడంగల్ బంద్‌కు పిలుపునిచ్చినట్లు కన్వీనర్ కోట్రికె లక్ష్మీనారాయణ గుప్త, కో కన్వీనర్ జీ.సురేశ్‌కుమార్, రమేశ్‌బాబు తెలిపారు. మంగళవారం కొడంగల్‌లో వారు విలేకరులతో మాట్లాడుతూ గురువారం నిర్వహించే బంద్‌కు ప్రజలు స్వచ్ఛందంగా సహకరించాలని జయప్రదం చేయాలని కోరారు.

నాగారంలో 4జీ సేవలు ప్రారంభం


4జీ సేవలను ప్రారంభిస్తున్న ఎంపీ

ధారూరు, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): నాగారం గ్రామంలో బీఎస్ఎన్ఎల్ రూ.70లక్షలతో సెల్‌టవర్‌ను నిర్మించి 4జీ సేవలను ప్రారంభించింది. ఈ మేరకు మంగళవారం చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి సెల్ టవర్‌ను ప్రారంభించారు. కేంద్ర ప్రభుత్వ అధీనంలోని బీఎస్ఎన్ఎల్ సంస్థ నిర్మించిన సెల్‌ఫోన్ టవర్‌ను వినియోగించుకోవాలన్నారు. అనంతరం భారతీయ నూనెగింజల పరిశోధన సంస్థ తెలంగాణ శాఖ ఆధ్వర్యంలో నువ్వులు(టీటీటీ-1), కుసుమలు(ఐఎస్ఎఫ్-764) వంగడాల విత్తనాలను ఎంపీ రైతులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు వి.నందు, రాజునాయక్, వివేకానంద రెడ్డి, రాజేందర్ గౌడ్, రమేశ్, వ్యవసాయ శాస్త్రవేత్తలు, బీఎస్ఎన్ అధికారులు పాల్గొన్నారు.

సంజీవరెడ్డి కుటుంబానికి పరామర్శ

తాండూరు రూరల్: మండలంలోని సంగెంకలాన్ గ్రామంలో అట్రాసిటీ కేసులో జైలుకు వెళ్లిన బీజేపీ జిల్లా నాయకుడు సంజీవరెడ్డి కుటుంబాన్ని ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి పరామర్శించారు. మంగళవారం వారి ఇంటికి కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. పార్టీ, తాను అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. ఆయన వెంట బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎం.రమేష్ కుమార్, బాలేశ్వర్‌గుప్తా, బొప్పి శ్రీహరి, షేకాపురం ఆంజనేయులు ఉన్నారు.

పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ

కీసర, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): దమ్మాయిగూడ మున్సిపల్ కమిషనర్ పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. ఈ మేరకు వీలిన గ్రామాల సమస్యల పరిష్కారానికి రచ్చబండ కార్యక్రమం ఏర్పాటు చేశారు. 'శుభ్రతే శ్రేయస్సుకు ప్రతీక' అనే నినాదంతో మంగళవారం కీసర, అంకిరెడ్డిపల్లి గ్రామాల్లో దమ్మాయిగూడ మున్సిపల్ కమిషనర్ ఎస్.వెంకట్‌రెడ్డి పర్యటించారు. ఈ మేరకు ప్రధాన రహదారులు, కాలనీలు, మార్కెట్ ప్రాంతం పర్యటించి సిబ్బందికి తగిన సూచనలు చేశారు. అనంతరం అంకిరెడ్డిపల్లిలో రచ్చబండ కార్యక్రమం ఏర్పాటు చేసి, గ్రామపెద్దలతో సమస్యలు అడిగి తెలుసుకున్నారు.


అంకిరెడ్డిపల్లిలో గ్రామపెద్దలతో మాట్లాడుతున్న దమ్మాయిగూడ మున్సిపల్ కమిషనర్ వెంకట్‌రెడ్డి

క్రైం కార్నర్

పెళ్లింట విషాదం

● చెరువులో మునిగి వ్యక్తి మృతి


అఖిల్ పాష మృతదేహం వద్ద రోదిస్తున్న బంధువులు

బొంరాస్‌పేట్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): వ్యక్తి మృతితో పెళ్లింట విషాదం నెలకొంది. వివరాల్లోకి వెళితే.. హైదరాబాద్‌లోని గోల్కొండకు చెందిన అఖిల్ పాష(42) ప్లంబర్‌గా పనిచేస్తూ జీవిస్తున్నాడు. వీరి బంధువులైన మండలంలోని బురాన్‌పూర్ గ్రామానికి చెందిన గులాం రసూల్ కుమారుడు అర్షద్‌పాష వివాహానికి ఆదివారం కుటుంబసభ్యులతో కలిసి హాజరయ్యాడు. పరిగిలో సోమవారం జరిగిన డిన్నర్ వేడుకలో కుటుంబసభ్యులతో కలిసి పాల్గొన్న అనంతరం బురాన్‌పూర్‌కు వచ్చాడు. వేడుకల్లో భాగంగా హోలీ ఆడిన బంధువులు, కుటుంబ సభ్యులు గ్రామ సమీపంలోని పెద్ద చెరువుకు స్నానాల నిమిత్తం వెళ్లారు. 15మంది కుటుంబ సభ్యులు, బంధువులు చెరువులో స్నానాలు చేస్తుండగా అఖిల్‌పాష చెరువులో ఉన్న గుంతల కారణంగా ఈత రాకపోవడంతో నీటిలో మునిగిపోయాడు. కుటుంబ సభ్యులు కాపాడే ప్రయత్నం చేసినప్పటికీ అఖిల్‌పాష మృతిచెందాడు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకొని పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని కొడంగల్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

అదృశ్యమైన వ్యక్తి మృతి

యాలాల, అక్టోబరు 14, (ఆంధ్రజ్యోతి): అదృశ్యమైన వ్యక్తి మృతి చెందిన ఘటన యాలాల మండల మండలంలో చోటుచేసుకుంది. యాలాల ఎస్ఐ విఠల్‌రెడ్డి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండల పరిధిలోని అన్నాసాగర్‌కు చెందిన దొడ్ల శేఖర్ కూలి పనిచేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈనెల 9వ తేదీన రాత్రి 10గంటల సమయంలో శేఖర్ బాణాపూర్ గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ శెట్టి నాయక్ (సునిల్)తో కలిసి వెళ్లారు. శేఖర్ కుటుంబ సభ్యులు ఇచ్చిన సమాచారం మేరకు 14వ తేదీన రాత్రి బాణాపూర్‌లోని సర్వేనంబర్-52లోని నీరటి షాకప్ప, నీరటి రాజులు అడవి పందుల కోసం ఏర్పాటు చేసిన విద్యుత్ వైర్ షాక్ తగిలి మృతి చెందినట్లు ఎస్ఐ తెలిపారు. మృతుడి వద్ద నాటుతుపాకీ, బ్యాటరీ ఉన్నట్లు ఎస్ఐ వివరించారు. విచారణ అనంతరం శేఖర్ మృతికి కారణమైన వారిపై చర్యలు తీసుకుంటామని ఎస్ఐ తెలిపారు.

అక్రమ ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

బొంరాస్‌పేట్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): మహంతీపూర్ వాగు నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను రెవెన్యూ అధికారులు పట్టుకున్నారు. అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న ట్రాక్టర్లపై మంగళవారం ఉదయం నుంచి గ్రామస్తులు రెవెన్యూ, మైనింగ్ అధికారులకు ఫోన్‌ద్వారా సమాచారం అందించారు. సాయంత్రం దాడులు నిర్వహించి రెండు ట్రాక్టర్లను పట్టుకున్నారు. పట్టుబడిన ట్రాక్టర్ల సమాచారాన్ని రెవెన్యూ అధికారులు తెలపకపోవడంతో తహసీల్దార్ పద్మావతిని వివరణ కోరగా మహంతీపూర్ వాగు నుంచి రెండు ట్రాక్టర్లను పట్టుకొని పోలీసులకు అప్పగించినట్లు ఆమె తెలిపారు. దాడుల్లో ఆర్ఐ శిరీష పట్టుబడిన ట్రాక్టర్ల వివరాలను గోప్యంగా ఉంచడంపై గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తంచేశారు.

హరికృష్ణను కలిసిన మేడ్చల్ టీడీపీ నాయకులు


హరికృష్ణను శాలువాతో సత్కరిస్తున్న టీడీపీ నాయకులు

ఘట్‌కేసర్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): ఏపీలోని విజయవాడ కనకదుర్గ ఆలయ ట్రస్టు బోర్డు సభ్యుడిగా నియమితులైన టీడీపీ సీనియర్ నాయకుడు హరికృష్ణను మేడ్చల్ నియోజకవర్గ టీడీపీ నాయకులు కలిశారు. నగరంలోని హరికృష్ణ నివాసానికి మంగళవారం వెళ్లిన నాయకులు ఆయనను కలిసి అభినందించారు. ఈ సందర్భంగా ఆయనను శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ నుంచి హరికృష్ణను నియమించడం పట్ల ఏపీ సీఎం చంద్రబాబు నాయుడుకు కృతజ్ఞతలు తెలిపారు. హరికృష్ణను కలిసిన వారిలో మేడ్చల్ నియోజకవర్గ టీడీపీ నాయకుడు సుంకరి వెంకటేష్, ఘట్‌కేసర్ మున్సిపాలిటీ నాయకులు వేముల సంజీవ గౌడ్, టి.మహేష్, సామల జగన్‌మోహన్‌రెడ్డి, నాయకుడు కొండా జంగారెడ్డి తదితరులున్నారు.

అర్హతలేని అధ్యాపకులను తొలగించాలి


ధర్నా చేస్తున్న టీపీటీఎల్ఎఫ్, ఎస్ఎఫ్ఐ విద్యార్థి సంఘాల నాయకులు

ఘట్‌కేసర్ రూరల్, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): ఏసీఈ కళాశాలలో అర్హతలేని అధ్యాపకులను వెంటనే తొలగించాలని టీపీటీఎల్ఎఫ్, ఎస్ఎఫ్ఐ విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం ధర్నాకు దిగారు. అంకుశాపూర్‌లోని ఏసీఈ కళాశాలలో అర్హత కలిగిన ముగ్గురు ఫ్యాకల్టీలను కళాశాల యాజమాన్యం అకారణంగా తొలగించి, అర్హతలేని అధ్యాపకులను రిక్రూట్ చేస్తున్నారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి సంఘాల నాయకులు ఏ.విజయ్‌కుమార్, కార్తిక్ రెడ్డి, సాయి, రాజేష్, సిరాజ్, గణేష్, అభినవ్, సాయిదత్త, కిషోర్, అరుణ్, రమేష్ తదితరులు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా ఈ విషయమై కళాశాల ప్రతినిధి విజయ్‌కుమార్‌ను వివరణ కోరగా టీపీటీఎల్ఎఫ్, ఎస్ఎఫ్ఐ విద్యార్థి సంఘాల నాయకుల ఆరోపణల్లో వాస్తవం లేదన్నారు. అన్ని విభాగాల అధ్యాపకులు అర్హత కలిగిన వారేనని తెలిపారు.

హైదరాబాద్ వెళ్లే రోడ్డుపై దృష్టి పెట్టాలి

● బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు సుదర్శన్ గౌడ్

తాండూరు, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి బైపాస్‌రోడ్డు భూనిర్వాసితులకు పరిహారం కోసం చూపిన శ్రద్ధ తాండూరు నుంచి హైదరాబాద్ వెళ్లే రోడ్డుపైనా చూపాలని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు సుదర్శన్‌గౌడ్ అన్నారు. తాండూరు నుంచి హైదరాబాద్‌కు వెళ్లే రాష్ట్ర రాజధాని రోడ్డు నరకంగా మారిందన్నారు. ప్రయాణికులు ప్రాణాలను అరచేతిలో పెట్టుకోవాల్సి వస్తుందని తెలిపారు. అంబులెన్స్‌లు సైతం వెళ్లలేని పరిస్థితి ఉందన్నారు. ఇటీవల ఆటో బోల్తా, అంబులెన్స్ టైర్లు ఊడిపోయి ఎంతో మంది గాయాలపాలయ్యారని తెలిపారు. ఇప్పటికైనా హైదరాబాద్ వెళ్లే మార్గంలో రోడ్డు బాగుచేయాలని కోరారు.

తాగునీటి సమస్య పరిష్కరించాలి

బొంరాస్‌పేట్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): మెట్లకుంటలో తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు, బీఆర్ఎస్ నాయకులు ఎంపీడీవో వెంకన్‌గౌడ్‌కు మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలమయ్యగౌడ్, అంజిలయ్య, సలీమ్, చంద్రమోహన్, కృష్ణ, చిన్న అంజిలయ్య తదితరులు పాల్గొన్నారు.

భూపత్రాలు అందజేత

దుద్యాల్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి సమీపంలో ధాన్యంనిల్వ కేంద్రాన్ని ఏర్పాటు చేయనున్నారు. అందులో భాగంగా మంగళవారం దుద్యాల్ నుంచి లగచర్ల మార్గంలోని కృష్ణగిరి ప్రాంతంలో సర్వేనంబర్ 191లో 10ఎకరాల భూమిని ఆర్ఐ నవీన్‌కుమార్, సర్వేయర్ మహేశ్ సర్వేతో హద్దులు గుర్తించారు. అనంతరం రాష్ట్ర గిడ్డంగుల సంస్థ రీజనల్ మేనేజర్ వేణుగోపాల్, మేనేజర్ విజయ్‌కుమార్‌కు 10 ఎకరాల భూమికి సంబంధించిన పొజిషన్ పత్రాలను తహసీల్దార్ కిషన్‌నాయక్‌కు అందజేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఆకారం వేణుగోపాల్, కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి మెరుగు వెంకటయ్య, ఖాజా, సత్యనారాయణ, ఖలీల్‌పాష, హన్మంతునాయక్ పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత

ఘట్‌కేసర్ రూరల్: పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత అని సీతాపల్‌మండి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ బి.వెంకటేశం తెలిపారు. పోచారం మున్సిపాలిటీ, కొర్రెములలో మంగళవారం సీతాఫల్‌మండి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ వలంటీర్లు పరిసరాల పరిశుభ్రతలో భాగంగా వీధులను శుభ్రం చేసి, రోడ్లపై ఉన్న గుంతల్లో మట్టిపోసి పూడ్చారు.

ఆలయంలో ప్రత్యేక పూజలు

దుద్యాల్: తెలంగాణ గ్రామీణ బ్యాంకు మహబూబ్‌నగర్ రీజనల్ మేనేజర్ శీలా, ఆడిట్ ఆఫీసర్ చిన్న, ఫీల్డ్ ఆఫీసర్ సాయి సంపత్‌రెడ్డిలు మంగళవారం దుద్యాల్ మండలంలోని పోలెపల్లి శ్రీ రేణుకా ఎల్లమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ఈవో రాజేందర్‌రెడ్డి, చైర్మన్ జయరాములు వారిని సన్మానించారు.

విద్యతోనే సమానత్వం

పరిగి: విద్యతోనే సమానత్వం ఏర్పడుతుందని పరిగి ఎస్ఐ మోహనకృష్ణ అన్నారు. ఎంవీఎఫ్ ఆధ్వర్యంలో మంగళవారం పరిగిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సమానత్వం-బాలికల ఉన్నత విద్యపై జరిగిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ విజయ్‌కుమార్, రాములు పాల్గొన్నారు.

పోటీ పరీక్షల మెటీరియల్ పంపిణీ

దోమ: బొంపల్లి ఉన్నత పాఠశాలలో జీవశాస్త్రం ఉపాధ్యాయుడు విజయ్‌సాయి విద్యార్థులకు పోటీ పరీక్షల మెటీరియల్‌ను పంపిణీ చేశారు. 8వ తరగతి విద్యార్థులకు రూ.3వేలు విలువ గల మెటీరియల్‌ను మంగళవారం ఎంఈవో వెంకట్ ఆధ్వర్యంలో అందజేశారు.

దడువాయిలకు దరఖాస్తుల ఆహ్వానం

తాండూరు: తాండూరు వ్యవసాయ మార్కెట్ వద్ద దడువాయిల(వెయింగ్ మ్యాన్) పనికి దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు జిల్లా మార్కెటింగ్ అధికారి సారంగపాణి ఓ ప్రకటనలో తెలిపారు. పదో తరగతి పూర్తి చేసిన 35 సంవత్సరాల లోపు వారు అర్హులని తెలిపారు.

ఎక్మాయి పాఠశాలలో విద్యార్థులకు అవగాహన

బషీరాబాద్: ఎక్మాయి జడ్పీ ఉన్నత పాఠశాలలో గోపాల్స్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో 'ప్రకృతియే ఆరోగ్యం' అనే అంశంపై మంగళవారం విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఆ సంస్థ కో-ఆర్డినేటర్ శివకుమార్, జీహెచ్ఎం పాండురంగామూర్తి, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

విద్యార్థులకు చేయుతనివ్వాలి

కొడంగల్ రూరల్: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే పేద విద్యార్థులకు చేయూతనివ్వాలని డిప్యూటీ డీఎం అండ్ హెచ్‌వో డాక్టర్. రవీంద్రయాదవ్ అన్నారు. శ్రీ సత్యసాయి భజన మండలి కొడంగల్ సభ్యులు నియోజకవర్గంలోని దౌల్తాబాద్ మండలంలోని నీటూర్ గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలోని 103 మంది విద్యార్థులకు మంగళవారం భోజన పేట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్సై జీవీ. సత్యనారాయణ, దౌల్తాబాద్ ఎంఈఓ వెంకటస్వామి పాల్గొన్నారు.

18న బంద్‌కు కురుమ సంఘం మద్దతు

తాండూరు: 42శాతం రిజర్వేషన్ల సాధనకు బీసీ సంఘాల జేఏసీ పిలుపు మేరకు ఈనెల 18వ తేదీన చేపట్టిన రాష్ట్ర బంద్‌కు కురుమ సంఘం తాండూరు డివిజన్ కమిటీ మద్దతు పేర్కొంది. తాండూరు బీరప్ప స్వామి దేవాలయ భవనంలో మంగళవారం సమావేశమై ఏకగ్రీవంగా తీర్మానించారు. ఈ సమావేశంలో న్యాయవాది గోపాల్, జగదీష్, పాండు, ఉపాధ్యక్షులు మల్లప్ప, శేఖర్, హన్మయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఆలయ ప్రాంగణంలో సీసీ కెమెరాల ఏర్పాటు

దుద్యాల్: పోలెపల్లి శ్రీరేణుకా ఎల్లమ్మ ఆలయం ఎదుట మంగళవారం రెండు సీసీ కెమెరాలను ఏర్పాటు చేయించారు. ఈ కార్యక్రమంలో ఈవో రాజేందర్‌రెడ్డి, చైర్మన్ జయరాములు, నర్సిములు, రాములు, వెంకటయ్యగౌడ్ పాల్గొన్నారు.

పోలీసులకు రివార్డు

దుద్యాల్: అదృశ్యమైన మహిళలను పట్టుకున్న కేసులో ఇద్దరు పోలీస్ సిబ్బందికి రివార్డు లభించింది. పోలపల్లికి చెందిన కొత్తూర్ బాలమణి ఈనెల 5వ తేదీన అదృశ్యమైంది. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు దుద్యాల పోలీసులు దర్యాప్తు ప్రారంభించి ఆమె ఆచూకీ తెలుసుకొని కుటుంబసభ్యులకు అప్పగించారు. ఈ కేసులో చాకచక్యంగా వ్యవహరించిన కానిస్టేబుల్ అమృత, శంకర్‌లను ఎస్సై యాదగిరి అభినందించి రూ.వెయ్యి చొప్పున ప్రోత్సాహాన్ని అందజేశారు.